మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 7-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 278 Issue: 278

Published from Jagitial
Circulated to Telangana

07 ఏప్రిల్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:26 తిథి పంచమి సా. 4:35 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం జ్యేష్ఠ తె. 5:47o వరకు తరువాత మూల యోగం వ్యతీపాత సా. 4:10 వరకు కరణం తైతుల సా. 4:35 వరకు గరజి తె. 5:49o వరకు వర్జ్యం ఉ. 9:13 నుండి ఉ. 11:01 వరకు దుర్ముహూర్తం ఉ. 8:37 నుండి ఉ. 9:26 వరకు రా. 11:07 నుండి రా. 11:54 వరకు రాహుకాలం మ. 3:22 నుండి సా. 4:54 వరకు యమగండం ఉ. 9:14 నుండి ఉ. 10:46 వరకు గుళికాకాలం మ. 12:18 నుండి మ. 1:50 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు రా. 8:00 నుండి రా. 9:48 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## చేదు అనుభవాలు చాలు

### తాత్కాలిక సీజ్‌ఫైర్‌కు

# సిద్ధంగా లేం

### దేశ ప్రయోజనాల పరిధిలోనే చర్చలు

### ఇరాన్ సంచలన ప్రకటన.. 10 షరతులు

పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా రహస్య చర్చల్లో 45 రోజుల కాల్పుల విరమణకు ఒక ముసాయిదాను సిద్ధం చేస్తున్నారన్న నివేదికల వేళ ఇరాన్ సంచనల ప్రకటన చేసింది. గత శాంతి ఒప్పందాలు విఫలమైన నేపథ్యంలో తాము తాత్కాలిక కాల్పుల విరమణకు సిద్ధంగా లేమని ఇరాన్ తేల్చిచెప్పింది. యుద్ధం, కాల్పుల విరమణ, చర్చలు, సంఘర్షణ వంటి 'అనేక చేదు అనుభవాలను' మళ్లీ మళ్లీ పునరావృతం చేయాలనుకోవడం లేదని ఆ దేశం ఉద్ఘాటించింది. యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో జరుగుతున్న చర్చల్లో ఇరాన్ వ్యూహాత్మక వైఖరిని అనుసరిస్తోంది.

టెహ్రాన్: తమ ప్రజల ప్రయోజనాలకు రక్షణ కల్పిస్తామని హామీ లభించినప్పుడే దౌత్య చర్చలకు ముందుకెళ్తామని భారత్‌లో ఇరాన్ రాయబారి డాక్టర్ మహమ్మద్ ఫతాలీ స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిని తెరవడం వంటి కీలక అంశాలపై రాజీకి ఇరాన్ నిరాకరించడం శాంతి చర్చలకు ఒక పెద్ద అడ్డంకిగా మారింది. ఖతర్, టర్కీ, పాకిస్థాన్ వంటి దేశాల మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ప్రతిపాదన చర్చల దశలో ఉన్నప్పటికీ, ఒత్తిడికి తలొగ్గి తొందరపడరాదని ఇరాన్ నిర్ణయించుకుంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రతిదాడులు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తుండటంతో ఈ సంక్షోభం మరింత జటిలంగా తరువాయి 2 వ పేజీలో...

## ఇక కాస్కోండి

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

సీజ్ ఫైర్‌ను ఇరాన్ తిరస్కరించడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. దీనికి చాలా ప్రత్యామ్నాయ మార్గాలున్నాయని అన్నారు. వెంటనే ఇరాన్‌పై దాడి చేయకపోయినా.. సీరియస్ యాక్షన్ త్వరలోనే చూస్తారని అన్నారు.

ఇరాన్ కోలుకోడానికి ఏళ్లు పడుతుందని హెచ్చరించారు. ఈ వ్యవహారాన్ని త్వరలోనే ముగిస్తామని అన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండటాన్ని తాము అంగీకరించబోమని చెప్పారు. ఇరాన్‌కి విధించిన గడువు ముగియనున్న నేపథ్యంలో ట్రంప్ ప్రెస్ మీట్ పెట్టారు. వైట్ హౌస్‌లో - 2 వ పేజీలో...

# కిరాతక ఖాకీలకు ఉరి

### లాకప్‌డెత్ కేసులో 9 మంది పోలీసులకు మరణశిక్ష

### తమిళనాడులోని మదురై కోర్టు సంచలన తీర్పు



తమిళనాడుకు చెందిన తండ్రీకొడుకుల లాకప్‌డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2020 నాటి ఈ కేసులో 9 మంది పోలీసులకు మదురై జిల్లా కోర్టు సోమవారం ఉరిశిక్ష విధించింది. అత్యంత క్రూరత్వం, అధికార దుర్వినియోగంతో కూడిన 'అరుదైన వాటిలోకెల్లా అరుదైన నేరం'గా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

మదురై: తమిళనాడులోని సాతాంకులానికి చెందిన వ్యాపారి జయరాజ్ అతడి కుమారుడు బెన్నిక్స్.. పోలీసులు కస్టడీలో ఉండగా చనిపోయారు. లాకప్‌లో పోలీసులు చిత్రహింసలకు గురిచేయడం వల్లే ఈ ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్టు కోర్టు నిర్ధారించింది.ఆరు సంవత్సరాల పాటు కొనసాగిన విచారణలో తొలుత అడిషినల్ జిల్లా సెషన్స్ జడ్జ్ ముతుకుమారన్.. 9 మంది పోలీసులను దోషులుగా నిర్ధారించారు. కస్టడీలో జరిగిన హింస ముందుగా ప్లాన్ చేసుకుని, దానిని రాత్రంతా కొనసాగించారని, అందువల్ల గరిష్ఠ శిక్ష విధించవచ్చన్న సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వాదనలను కోర్టు అంగీకరించింది. దోషులుగా తేలిన వారిలో ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీధర్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు పీ రఘుగణేశ్, కే బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్ మురుగన్, సమదురై, కానిస్టేబుళ్లు ఎం ముత్తురాజ్, ఎస్ తరువాయి 2 వ పేజీలో...



# ఒవైసీలకు రేవంత్ దాసోహం

### పోలీసులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోరా?

### చట్టం పాతబస్తీలో ఒకలా.. రాష్ట్రమంతా ఒకలానా?

### కేంద్ర మంత్రి బండి సంజయ్ నిప్పులు



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంఐఎం నేతలకు, ముఖ్యంగా ఒవైసీ సోదరులకు 'దాసోహం' అయ్యారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. పాతబస్తీలో పోలీసులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. "పాతబస్తీని మొత్తం ఒవైసీ సోదరులకు రాసిచ్చారా?" అని ముఖ్యమంత్రిని ఉద్దేశించి బండి సంజయ్ ప్రశ్నించారు. రాష్ట్ర రాజధానిలో అంతర్భాగమైన ఓల్డ్ సిటీలోనే శాంతిభద్రతలను కాపాడలేని ముఖ్యమంత్రి, మారుమూల ఆదిలాబాద్ వంటి ప్రాంతాలను ఎలా అభివృద్ధి చేస్తారని ఆయన అనుమానం వ్యక్తం తరువాయి 2 వ పేజీలో...

# తిండికి ఢోకా లేదు

### నిత్యావసరాల ధరల్లో మార్పు లేదు

### కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక సమీక్ష నిర్వహించింది. ప్రస్తుతం దేశంలో బఫర్ స్టాక్స్ తగినంతగా ఉన్నయని తెలిపింది. ప్రజలకు రోజువారి అవసరాలకు సంబంధించిన నిత్యావసర ధరల్లో పెద్దగా మార్పులు ఉండే అవకాశాలు లేవని తెలిపింది. గోధుమ, బియ్యం, ఉల్లి, టమాట, ఆలు ధరలు స్థిరంగా ఉన్నాయని -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,066 |
| వెండి (గ్రాము): | రూ.260 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,926 |

## విశ్వవాణి



2009లో ప్రవేశపెట్టిన డిజిటల్ లర్నింగ్‌ను ప్రస్తుతం స్వీడన్‌లోని స్కూళ్లలో తొలగించారు. మళ్లీ పాత పద్ధతులైన.. పుస్తకాలు, పెన్సిల్స్, చేతి రాతను పరిచయం చేశారు.



# కొత్త జిల్లాల జాడ 2027లోనే..!

### త్వరలోనే ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు

### జూన్ 2వ తేదీన శిలాఫలకం వేస్తాం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2027 మార్చి వరకు జిల్లాల సరిహద్దు మార్పులకు అవకాశం లేదని, ఆ తర్వాత జ్యుడీషియల్ కమిషన్ వేసి బోథ్ రెవెన్యూ డివిజన్ వంటి డిమాండ్లను పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు.

నిర్మల్/బాసర, ఏప్రిల్ 6 (ఈవార్తలు): ఈ పర్యటనలో భాగంగా రూ. 225 కోట్ల రూపాయలతో ప్రభుత్వం చేపబట్టబోతున్న బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునర్ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు -2 వ పేజీలో...



# జమిలి దిశగా..!

### ఒకే దేశం - ఒకే ఎన్నికపై పురోగతి

### ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం

### బీజేపీ వార్షికోత్సవంలో ప్రధాని మోదీ

భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ), ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు.

న్యూఢిల్లీ: బీజేపీ 47వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం తరువాయి 2 వ పేజీలో...



# త్వరలోనే తులం బంగారం

### గ్యారెంటీలన్నీ అమలు చేస్తాం

### మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వానికి రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ఇప్పటికే మెజారిటీ హామీలను అమలు చేశామని, మిగిలినవన్నీ ఈ ఐదేళ్ల పదవీ కాలంలోనే నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా తులం బంగారం హామీని కూడా త్వరలోనే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ కావాలనే '420 హామీలు' అంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తోందని, వారి జిమ్మిక్కులను ప్రజలు నమ్మరని మంత్రి ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ప్రాక్టికల్‌గా ఉంటూ ఆచరణాత్మక పథకాలను రూపొందిస్తోందని, కొద్దిగా ఆలస్యమైనా ప్రతి మాటనూ నిలబెట్టుకుంటామని తరువాయి 2 వ పేజీలో...



# రేవంత్ 'భూ' భ్రమణం

### 'దిల్' భూములపై సీఎం కన్ను

### మాజీమంత్రి హరీశ్ ఆరోపణలు

హైదరాబాద్ శివారులోని కోహెడ పండ్ల మార్కెట్ భూములపై సీఎం రేవంత్ కన్ను పడిందని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. 'రాజకీయాల కోసం రాలేదు...రైతుల కోసం ఇక్కడకు వచ్చాం. సమస్య కాంగ్రెస్ పార్టీ కాదు రైతుల సమస్యలు. ఏ ప్రభుత్వం అయిన రైతుల కోసం చేయాలి కానీ దళారుల కోసం పని చేయద్దు' అని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు.

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): 'దళారుల కోసం కాకుండా రైతుల కోసం ఆలోచన చేయాలి' అని రేవంత్ రెడ్డికి సూచించారు. రైతుల భవిష్యత్తు కోసం ఆలోచన చేసి కోహెడలో అంతర్జాతీయ స్థాయిలో ఫ్రూట్ మార్కెట్ పెట్టాలని కేసీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు. 'అనాడు నేను మంత్రిగా ఉన్నప్పుడు రైతులకు సహాయం చేయాలని అన్నప్పుడు నేను రూ.10 కోట్లు మంజూరు చేయించా. ఇక్కడ 200 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో ఫ్రూట్ మార్కెట్ కట్టాలని ఇక్కడ స్థలం కేటాయించారు. మార్కెటింగ్ శాఖ మంత్రిగా తరువాయి 2 వ పేజీలో...



2

# 'అమరావతి' గెజిట్ విడుదల

ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. పార్లమెంట్ ఆమోదం అనంతరం అమరావతి బిల్లు రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది.

# రాశి ఫలాలు

5.4.2026

మేషం: ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. సమాజంలో పెద్దల అనుగ్రహంతో కీలకమైన పనులు పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

వృషభం: ప్రయాణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి, వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. కీలక విషయాలలో ఆలోచించి ముందుకు సాగాలి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు మానసికంగా కొంత చికాకు కలిగిస్తాయి.

మిధునం: చేపట్టిన పనులలో మార్గ అవరోధాలు కలుగుతాయి. అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు కలుగుతాయి. మాతృ వర్గ బంధు మిత్రులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారములలో నష్ట సూచనలున్నవి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు.

కర్కాటకం: చేపట్టిన పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. బంధు, మిత్రులతో గృహమున సఖ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి ఉద్యోగమున పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడుతుంది. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది.

సింహం: నేత్ర సంభందిత సమస్యలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. వృత్తి ఉద్యోగములలో బాధ్యతలు నిర్వహించడంలో లోటుపాట్లు కలుగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి.

కన్య: ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. మొండి బాకీలు ఋణాలు తీర్చగలుగుతారు. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశములు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు నూతన పెట్టుబడులు లభిస్తాయి.

తుల: గృహ నిర్మాణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. కీలక వ్యవహారాలలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పై అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. ఇంటా బయట సమస్యాత్మక వాతావరణం ఉంటుంది.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కొన్ని పనులు అనుకూలంగా పూర్తిచేస్తారు. ఆర్థికంగా వ్యవహారాలు సంతృప్తి కలిగిస్తాయి. వృత్తి,ఉద్యోగాల్లో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది.

ధనస్సు: దైవ సేవా కార్యక్రమాలు నిర్వహించి పెద్దల నుండి ప్రశంసలు అందుకుంటారు. వృత్తి, ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. మొండి బాకీలు సకాలంలో వసూలు అవుతాయి. బంధు మిత్రులతో సంతాన వివాహ విషయమై చర్చలు జరుగుతాయి. పాత మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు మరింత నిరాశ కలిగిస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పని భారం ఉన్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు.

కుంభం: బంధు మిత్రుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. దూర ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు చికాకు కలిగిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కలిసిరావు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక సమస్యలు కలుగుతాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి.

మీనం: వ్యాపార విషయమై పెద్దల సలహాలు తీసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చాలాకాలంగా వేధిస్తున్న స్థిరాస్తి వివాదాల నుండి బయటపడతారు. ఆర్థిక విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విద్యార్థులకు నూతన అవకాశములు లభిస్తాయి. పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు.

# తాత్కాలిక సీజ్‌ఫైర్‌కు సిద్ధంగా లేం

మొదటి పేజీ తరువాయి

మారుతోంది. సుస్థిర శాంతికి హామీ ఇవ్వని స్వల్పకాలిక చర్యల విషయంలో ఇరాన్ అప్రమత్తంగా ఉందని డాక్టర్ మహమ్మద్ ఫతాలీ పేర్కొన్నారు. 'యుద్ధం, కాల్పుల విరమణ, చర్చలు, మళ్లీ సంఘర్షణ అనే రూపంలో కొనసాగే చర్చలతో మాకు చాలా చేదు అనుభవం ఉంది. కాబట్టి, దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా తాత్కాలికంగా ఉద్రిక్తతలను తగ్గించడంపై మాత్రమే దృష్టి సారించే ఒప్పందాలను ఇరాన్ అంగీకరించదు' అని ఉద్ఘాటించారు. చర్చల విషయంలో తీసుకునే ఏ నిర్ణయమైనా దేశ ప్రయోజనాల పరిధిలోనే ఉంటాయని ఫతాలీ నొక్కి చెప్పారు. 'ఏ విధమైన చర్చలకు సంబంధించిన నిర్ణయాలు దేశ ఉన్నత స్థాయి విధానాలు, నిర్ణయాధికార సంస్థల ఆదేశాలకు అనుగుణంగానే తీసుకుంటాం. ఇరాన్ ప్రజల ప్రయోజనాలకు రక్షణ కల్పిస్తామని హామీ లభించినట్లయితే అవసరమైన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు.



## ఇరాన్ షరతులు....

- ఇరాన్ సరిహద్దుల వెంబడే కాకుండా లెబనాన్, గాజాలోనూ మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తనీయమనే హామీ ఇవ్వాలి.
- హర్మూజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణాధికారాన్ని ఆమోదించాలి.
- హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాను నియంత్రించడం, టోల్ వసూలు చేసేందుకు అనుమతించాలి.
- ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలను ఎత్తేయాలి.
- భవిష్యత్తులో తమ దేశంపై దాడికి పాల్పడబోమనే హామీ ఇవ్వాలి.
- యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలకాలి
- తాత్కాలిక కాల్పుల విరమణకు నో చెప్పడం.
- విదేశాల్లో నిల్వ ఉన్న ఇరాన్ నిధులను వెంటనే విడుదల చేయాలి.
- యుద్ధంలో ఇరాన్‌కు కలిగిన నష్టాన్ని అంతర్జాతీయ సహాయం అందించాలి.
- ఇరాన్ భూభాగ సమగ్రత, రాజకీయ స్వాతంత్ర్యాన్ని అధికారికంగా గుర్తించాలి. అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దు.
- దీర్ఘకాలిక శాశ్వత శాంతి వ్యవస్థ కోసం ప్రత్యేక రోడ్ మ్యాప్‌ను తదుపరి చర్చల్లో ఉంచాలి. ఒక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

## ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర దాడులు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులతో విరుచుకుపడింది. సోమవారం ఇరాన్ భారీ క్షిపణులతో ఇజ్రాయెల్ నగరం టెల్ అవీవ్‌తో పాటు మొత్తం 15 ప్రాంతాల్లో దాడులు చేసింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల వల్ల అనేక ప్రదేశాలు దెబ్బతిన్నాయని ఇజ్రాయెల్ ఫైర్ అండ్ రెస్క్యూ నివేదించింది. ఈ దాడిలో గాయపడిన ఇద్దరికి ప్రస్తుతం చికిత్స అందిస్తున్నట్లు ఇజ్రాయెల్ రెస్క్యూ సర్వీస్ తెలిపింది. రోజంతా పదేపదే సైరన్‌లు మోగుతుండగా, రాబోయే మరిన్ని దాడుల గురించి అధికారులు హెచ్చరిస్తూ, నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు.

# ఇక కాస్కోండి

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ తమ దేశానికి చెందిన రెండో పైలట్‌ని కూడా ఇరాన్ నుంచి రక్షించామని చెప్పుకొచ్చారు. అలానే డెడ్‌లైన్‌కి ముందు ఇరాన్‌కి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. 'మంగళవారం వరకు ఇరాన్‌కి గడువు ఉంది. డెడ్ లైన్ తర్వాత ఇరాన్‌కి గడువు పొడిగింపు ఉండదు. ఇరాన్ దిగిరాకపోతే ఆ దేశ మౌలిక సౌకర్యాలపై దాడులు చేస్తాం. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ విజయవంతంగా కొనసాగుతుంది. రెండో పైలట్‌ని ఇరాన్ నుంచి సురక్షితంగా తరలించాం. అతడి కోసం భారీ ఆపరేషన్ జరిగింది. ఈ ఆపరేషన్‌ని సమర్థంగా నిర్వహించినందుకు గర్విస్తున్నాం. ఏడు గంటల పాటు జరిగిన ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో అమెరికన్ సైనికులు గాయపడలేదు. ఏ దేశానికి లేని విధంగా అమెరికాకు ఆయుధాలు ఉన్నాయి. మునుపెన్నడూ లేని రీతిలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాం. శత్రువులకు చిక్కకుండా ఎత్తయిన కొండపైకి పైలెట్ చేరుకున్నాడు. అన్ని ప్రమాదాలని ధ్వంసం చేసి పైలట్‌ని రక్షించాం. మా హెలికాప్టర్లు పది నిమిషాల్లో తమ పని పూర్తిచేశాయి. వేలాది విమానాలతో దాడి చేస్తే ఇరాన్ ఒక్క విమానాన్నే కూల్చింది. మంగళవారం ఇరాన్ తుడిచిపెట్టుకుని పోవచ్చు' ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.

# తిండికి ఢోకా లేదు

మొదటి పేజీ తరువాయి

వాటి ధరల్లో ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేసింది. అదేవిధంగా దేశంలో ప్రస్తుతం ఎల్‌పీజీ కొరత తీవ్రతరమైన నేపథ్యంలో గ్యాస్ నిల్వలపై కీలక ప్రకటన చేసింది. ఎల్‌పీజీ సరఫరా తగిన మోతాదులో ఉందని రిఫైనరీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని పేర్కొంది. గ్యాస్ కొరతపై ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముడిచమురు సరఫరా సైతం తగినంతగా ఉందని తెలిపింది. కాగా యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ గల్ఫ్ దేశాలతో ఫోన్‌లో దౌత్య చర్చలు జరిపారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. అదే విధంగా ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీతోనూ మాట్లాడారు.

# ఒవైసీలకు రేవంత్ దాసోహం

మొదటి పేజీ తరువాయి

చేశారు. పాతబస్తీలో ఒక చట్టం, మిగతా నగరంలో ఒక చట్టం అమలు చేస్తున్నారా అని బండి సంజయ్ ప్రశ్నించారు. శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం పక్షపాత ధోరణి వీడాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సంజయ్ సోమవారం రాత్రి పాతబస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓల్డ్ సిటీలో నివసిస్తున్న పశ్చిమ బెంగాల్ వాసులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బెంగాల్‌లో రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలపాలని ఆయన వారిని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మమతా బెనర్జీ ప్రభుత్వంపైనే కాకుండా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై కూడా బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, అక్కడి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అందుకే హైదరాబాద్‌లో ఉంటున్న బెంగాలీలు కూడా బీజేపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో స్థానిక బీజేపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జమిలి దిశగా..!

మొదటి పేజీ తరువాయి

అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను బీజేపీ కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. 'మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి బీజేపీ కట్టుబడి ఉంది. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం' అని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని రద్దు చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందని పేర్కొన్నారు.

# త్వరలోనే తులం బంగారం

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. సీఎం ఒక కెప్టెన్‌లా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని, కేబినెట్ అంతా ఐక్యంగా ఉందని క్లారిటీ ఇచ్చారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకోవద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు.

# కొత్త జిల్లాల జాడ 2027లోనే..!

మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన ఆయన తర్వాత జిల్లాలోని పిప్రిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసగించారు. ఎన్నికలకు ముందు పీపుల్స్ మార్చ్ పేరుతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర పిప్రి నుంచే మొదలయిందని, ఇక్కడి ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ఆయన వరాల జల్లు కురిపించారు. గత ప్రభుత్వంలో ప్రతిపక్షాలను నిర్బంధించే సంస్కృతి ఉండేదని, కానీ తమ 'ప్రజాపాలన'లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా వేదికలపై మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. పార్టీలకు అతీతంగా, తమ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కూడా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం రాబోతోందని, వీలైతే జూన్ 2వ తేదీన దీనికి శిలాఫలకం వేస్తామని ప్రకటించారు. వేలాది ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నామని, దీని ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో త్వరలోనే యూనివర్సిటీని నిర్మిస్తామని, అలాగే బాసర క్షేత్రాన్ని దేశంలోనే గొప్పగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం వేగంగా కొనసాగుతోందని చెప్పారు. ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి, మంత్రి కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు సీఎం. ఇచ్చోడ నుంచి డెడ్రా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా ముత్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేశారు. సిరికొండ–కొండాపూర్ వంతెన ప్రారంభించారు. బోథ్ లో యంగ్ ఇండియా స్కూల్ కు శంకుస్థాపన చేశారు. నాగోబా దేవస్థానం అభివృద్ధి పనులు ప్రారంభించారు. మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ కు శంకుస్థాపన చేశారు.

# కిరాతక ఖాకీలకు ఉరి

మొదటి పేజీ తరువాయి

చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, వేలుముత్తులు పదో నిందితుడైన స్పెషల్ సబ్ఇన్‌స్పెక్టర్ పాల్దురై విచారణ కొనసాగుతున్న సమయంలో కొవిడ్‌తో మరణించారు. ఈ కేసు, 2020లో దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. కొవిడ్–19 లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి తమ మొబైల్ షాపు తెరిచారనే ఆరోపణలపై జయరాజ్, బెన్నిక్స్‌ను 2020 జూన్ 19న అరెస్టు చేశారు. సాతంకుళం పోలీస్ స్టేషన్‌లో వారిని చిత్రహింసలకు గురిచేశారని, ఈ క్రమంలో వారికి తీవ్ర గాయాలైయ్యాయని, బలమైన దెబ్బలు, అధిక రక్తస్రావం కూడా జరిగినట్టు దర్యాప్తులో తేలింది. జూన్ 22న తండ్రి, 23న కొడుకు కోవిల్‌పట్టి సబ్ జైల్లో ఉండగానే మృతిచెందారు. విచారణ ప్రకారం.. దాడి తర్వాత అధికారులు సాక్ష్యాలను మాయం చేయడానికి ప్రయత్నించారు. బాధితులతోనే రక్తాన్ని శుభ్రం చేయించారని, రక్తపు మరకలున్న బట్టలను పారవేశారని, నేరాన్ని కప్పిపుచ్చడానికి ఒక తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపణలు ఉన్నాయి. మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌కు సమర్పించిన సీబీఐ నివేదికలో లాకప్ గోడలు, టాయిలెట్, ఎస్‌హెచ్‌ఓ గది, లాఠీల నుంచి సేకరించిన రక్త నమూనాలు బాధితుల డీఎన్‌ఏలతో సరిపోలాయని ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలింది. జూన్ 19న రాత్రి 7:30 గంటల ప్రాంతంలో కామరాజర్ చౌక్ వద్ద జయరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారని, తన తండ్రిని నిర్బంధించారని తెలుసుకున్న బెన్నిక్స్ స్టేషన్‌కు వచ్చాడని నివేదిక పేర్కొంది. తన తండ్రిని పోలీసులు కొట్టడంతో బెన్నిక్స్ పోలీసులను ప్రశ్నించడంతో దీంతో అతడ్ని అరెస్ట్ చేసి టార్చర్ చేశారని కోర్టు వెల్లడించింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ. 1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# రేవంత్ 'భూ' భ్రమణం

మొదటి పేజీ తరువాయి

ఉన్న నిరంజన్ రెడ్డి రూ. 350 కోట్లు మంజూరు చేయించగా ఇంకా బ్యాంకులోనే ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో కన్సల్టెంట్ ద్వారా దీనిని మ్యాపింగ్ చేయించాం. భవిష్యత్తులో ఇక్కడే పూల మార్కెట్, ఫిష్ మార్కెట్‌లు రావాలని ఆలోచన చేశాం' అని వివరించారు. 'అంతర్జాతీయ మార్కెట్ కోసం అధికారులు వివిధ రాష్ట్రాల్లో పర్యటన చేసి అధ్యయనం చేశారు. భూ సేకరణ కూడా పూర్తి అయింది. లక్షలాది రైతుల కోసం ఈ ఆలోచన చేశాం. కొన్ని రకాల ఫ్రూట్స్ వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడ తెస్తారు. దానికి అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే మార్కెట్‌ను ప్లాన్ చేశాం. ఈ భూమిని మాయం చేసే కుట్ర చేస్తున్నారు' అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. 'ఇక్కడ రూ. 3 వేల కోట్ల విలువైన భూమి పరిశ్రమల శాఖకు బదిలీ చేసి వారికి నచ్చినవారికి కట్టబెట్టే ప్రయత్నం నడుస్తోంది. ఇప్పటికే దీనిపై కన్ను వేశారు అంట. లీలా హోటల్‌లో సమావేశాలు కూడా జరిపారు అంట' అని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. 'దిల్ భూముల సంగతి మనకు తెలియదా? దిల్(దక్కన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్) భూముల్లో మాకు వాటా ఉంటుంది అని ఏపీ ప్రభుత్వం అంటుంది. దిల్ భూమిలో పంచాయతీ నడుస్తోంది. ఆ భూమిలో 50 ఎకరాల వరకు రైతులు సాగు చేసుకుంటున్నారు. అక్కడ మార్కెట్ పెడుతున్నారని చెబుతున్నారు. అందులో మా భూమిలో పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. కిరికిరి భూమితో అయ్యేది కాదు పోయేది కాదు' అని తెలిపారు. 'ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ కట్టాలని ప్లాన్ చేసింది మార్కెటింగ్ శాఖ. మార్కెటింగ్ మంగళం.. భూమి మాత్రం ఖతం. సూర్యుడు చుట్టూ భూమి తిరిగితే భూమి చుట్టూ రేవంత్ రెడ్డి తిరుగుతాడు. ఈ భూమిపై రేవంత్ రెడ్డి కన్ను పడింది. రైతుల పక్షాన ఉంటావా? దళారుల పక్షాన ఉంటావా రేవంత్?' అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. వేలాది మంది ఈ మార్కెట్‌పై జీవనాధారం కొనసాగిస్తున్నారు. నీ కమీషన్‌ల కోసం రైతులను కూడా వదిలిపెట్టవా? అని నిలదీశారు. 'కబ్జాలకు కాదేది అన్నట్టు ఉంది ఈ ప్రభుత్వం తీరు. ఈ భూమి మార్కెటింగ్ శాఖకు చెందిన భూమి. పండ్ల మార్కెట్‌పై రేవంత్ రెడ్డి కన్ను పడింది' అని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హరీశ్ రావు ఆరోపించారు. 'పంట మార్పిడి అంటున్నావు మరి పండ్ల రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వారికి అన్ని రకాలుగా వసతులు కల్పించాలని కానీ ఇవన్నీ కాదని ఏదో చేస్తాను అంటున్నాడు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ కట్టే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం ఉంటుంది' అని స్పష్టం చేశారు. 'ఈ ప్రభుత్వం భూములు తప్ప ఇంకోటి కాదు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టింది. ఎక్కడ పడితే అక్కడ భూములను నిషేధిత జాబితాలో పెట్టి రేవంత్ రెడ్డి రైతుల ఉసురు తీస్తున్నాడు. దేవుడి పేరు చెప్పి కూడా ఈ ప్రభుత్వం లోని పెద్దలు వసూలు చేస్తున్నారు. దేవుడి పేరు చెప్పి వసూలు చెప్తే దేవుడు తగిన శాస్త్రి చేస్తాడు' అని రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తుమ్మల నాగేశ్వరరావు రైతు పక్షపాతి...నిజమైన రైతు బిడ్డ గా రైతులకు అండగా నిలవాలి. రేవంత్ రెడ్డితో పట్టుపట్టి ఈ భూమిలోనే రైతులకు ఫ్రూట్ మార్కెట్ కట్టాలి' అని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇక్కడ ఫ్రూట్ మార్కెట్ కట్టే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని హామీ ఇస్తున్నామని తెలిపారు. భూముల్లో భూములున్న వారికి కూడా మా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇస్తున్నట్లు హరీశ్ రావు చెప్పారు.

# 'అమరావతి' గెజిట్ విడుదల

న్యూఢిల్లీ: ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. పార్లమెంట్ ఆమోదం అనంతరం అమరావతి బిల్లు రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. ఈ బిల్లును పరిశీలించిన అనంతరం.. న్యాయ నిపుణులతో సంప్రదింపుల తర్వాత రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సబ్ సెక్షన్ 2లో రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర న్యాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్రం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టగా.. ఉభయసభలు ఆమోదం తెలిపాయి. సుమారు ఐదు గంటలు లోక్‌సభ, రాజ్యసభల్లో అమరావతి బిల్లుపై చర్చ జరిగింది. అనంతరం ఎలాంటి సవరణలు ప్రతిపాదించకుండానే బిల్లుకు లోక్ సభ, రాజ్యసభలు ఆమోదం తెలిపాయి. దీంతో లోక్‌సభ సచివాలయం అమరావతి బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపించగా.. రాష్ట్రపతి సోమవారం రోజున అమరావతి బిల్లుకు ఆమోద ముద్ర వేశారు. దీంతో అమరావతి బిల్లు చట్టరూపం దాల్చింది.

# భారత యువత ఉద్యోగాలిచ్చేలా ఎదగాలి

**కొలంబియా వర్సిటీలో కేటీఆర్**

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): భారతీయ యువత ఉద్యోగాల కోసం వెతికేవారిలా కాకుండా పారిశ్రామికవేత్తలుగా మారి ఉద్యోగాలను సృష్టించేవారిగా ఎదగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. అమెరికాలోని ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన 'ఫైర్‌సైడ్ చాట్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారత్ ఆర్థిక గమనం, కృత్రిమ మేధ, వ్యవస్థాపకత, మారుతున్న ఉద్యోగ రంగాలపై తన లోతైన విశ్లేషణలను విద్యార్థులతో పంచుకున్నారు. న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్ వార్షిక సదస్సులో ప్రసంగించిన అనంతరం కేటీఆర్ ప్రత్యేక చర్చ గోష్టిలో పాల్గొన్నారు. ఐటీ, పారిశ్రామిక రంగాలు, భారతదేశ ప్రగతి, నిరుద్యోగం, యువత, గెలుపు ఓటముల వంటి అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. గడిచిన దశాబ్ద కాలంలో భారత్ భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. 3జీ, 4జీ, 5జీ వంటి టెలికాం సాంకేతికతలను భారత్ ప్రపంచ దేశాల కంటే ముందుగానే అందిపుచ్చుకున్నదని గుర్తుచేశారు. ఇప్పుడు భారత్ ఒక కీలక దశలో ఉన్నదని.. ఇతర దేశాల అభివృద్ధి నమూనాలను కాపీ కొట్టే పరిస్థితి లేదని, సొంతంగా వినూత్నంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెను మార్పులు తీసుకురాబోతోన్నదని కేటీఆర్ హెచ్చరించారు. ఏఐ వల్ల రాబోయే రోజుల్లో మిలియన్ల కొద్దీ ఉద్యోగాలు ప్రభావితమవుతాయని.. ఈ విప్లవాన్ని తట్టుకోవాలంటే యువత నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. తాజాగా ఒరాకిల్ సంస్థ భారీ ఎత్తున ఉద్యోగులను తొలగించిన అంశాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. స్టార్టప్ కంపెనీలకు హైదరాబాద్ ఒక ఉదాహరణ అని కేటీఆర్ చెప్పారు. ఇంక్యుబేటర్లు, కో-వర్కింగ్ స్పేస్‌లు, మెంటార్ల ప్రోత్సాహం వల్లనే హైదరాబాద్ నుంచి అనేక యూనికార్న్ సంస్థలు పుట్టుకొచ్చాయని వివరించారు. దేశంలో వ్యవస్థాపకత పెరగాలంటే కేవలం పథకాలు ఉంటే సరిపోదని, ఒక పటిష్టమైన ఎకో సిస్టమ్ అవసరమని అభిప్రాయపడ్డారు. దేశంలో ఉన్న యువ జనాభా ఒక శక్తి అని, అదే సమయంలో అది ఒక సవాల్ అని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే కేవలం అవకాశాలు కల్పిస్తే సరిపోదని, సరైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయాలని చెప్పారు. మౌలిక సదుపాయాలు, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని సూచించారు.





## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## తండ్రి వివాహేతర సంబంధం

### ప్రాణాలు తీసిన కొడుకులు

భూపాలపల్లి, ఏప్రిల్ 6 (ఈవార్తలు): భూపాలపల్లి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తండ్రి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే ఆగ్రహంతో కన్న కొడుకులే అతడిని హతమార్చారు. జిల్లాలోని రేపాక గ్రామానికి చెందిన కుర్రే చేరాలు (55) ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం ఉదయం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. చేరాలుకు భార్య, కవల కుమారులు రామ్, లక్ష్మణ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం చేరాలు తన గ్రామానికే చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంపై కుటుంబంలో గొడవలు జరగడంతో, పదేళ్ల క్రితం ఆయన తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఇటీవల చేపల చెరువు లీజు వ్యవహారంపై పది రోజుల క్రితం తిరిగి గ్రామానికి వచ్చి మళ్లీ పాత ప్రియురాలి ఇంట్లోనే ఉండటం మొదలుపెట్టాడు. మూడు రోజులుగా తండ్రి ఫోన్లకు స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన కుమారులు రామ్, లక్ష్మణ్ శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి రేపాకకు చేరుకున్నారు. ప్రియురాలి ఇంట్లో ఉన్న తండ్రిని చూసి ఆగ్రహంతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన చేరాలు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. శనివారం అర్ధరాత్రి కొడుకులు గొడ్డలితో దాడి చేశారని, అడ్డువచ్చిన మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయారని పోలీసులు పేర్కొన్నారు. అయితే, కొడుకులు కోపంతో తండ్రి తలపై బలంగా మోదడంతోపాటు కడుపులో పిడిగుద్దులు గుద్దడంతోనే తీవ్రంగా గాయపడ్డాడని, వారే ఆసుపత్రికి తరలించారని గ్రామస్థులు అంటున్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు కుర్రే కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పెరగనున్న మద్యం ధరలు



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): రాష్ట్రంలోని మద్యం ప్రియులకు త్వరలో ధరల షాక్ తగలనుంది. మే నెల నుంచి మద్యం, బీర్ల ధరలు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు, రాష్ట్రంలో మద్యం ధరల సమీక్ష గడువు ముగియడం వంటివి ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల సహజవాయువు సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో గాజు సీసాల తయారీ ఖర్చు విపరీతంగా పెరిగింది. ఫలితంగా దేశంలో గాజు సీసాల ఉత్పత్తి 40 శాతం వరకు పడిపోగా, ఖాళీ సీసాల ధరలు 20 శాతం పెరిగాయి. ఈ అదనపు భారాన్ని భరించలేమని, ధరలను 12-15 శాతం పెంచాలని డిస్టిలరీ యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులను కలిసి ఈ మేరకు వినతిపత్రం కూడా సమర్పించాయి. తయారీదారుల విజ్ఞప్తితో ప్రభుత్వం కూడా ధరల పెంపుపై సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ జ్యుడీషియల్ కమిటీని నియమించింది. ఈ కమిటీ బాటిల్ సైజ్, బ్రాండ్ రేంజ్, ట్యాక్స్ వంటి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని ధరల పెంపుపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ముఖ్యంగా బీర్ల ధరల పెంపు అనివార్యంగా కనిపిస్తోంది. గత ఏడాదే 15 శాతం ధరలు పెరిగినప్పటికీ, ప్రస్తుతం సీసాల కొరత, అల్యూమినియం క్యాన్ల ధరలు పెరగడంతో కంపెనీలు మరోసారి పెంపును కోరుతున్నాయి. వేసవిలో బీర్లకు డిమాండ్ 30 శాతం పెరుగుతుండగా, సరఫరా 20 శాతం తగ్గడంతో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కొరత మొదలైంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా మే నెలలో ప్రభుత్వం కొత్త ధరలను ప్రకటించే అవకాశం ఉంది. సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందని ఎక్సైజ్ శాఖ ఆందోళన చెందుతోంది. మొత్తంగా, ఎక్కడో జరుగుతున్న యుద్ధం.. రాష్ట్రంలోని మందుబాబుల జేబులకు చిల్లు పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.



## ప్రియుడితో వెళ్లిపోయిందని..!

**భార్య గొంతుకోసి చంపేసిన భర్త**

జహీరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): ప్రియుడితో వెళ్లిపోయిన భార్యను గొంతు కోసి హత్య చేసిన ఘటన తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో చోటు చేసుకుంది. జహీరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి తన భార్య ప్రియుడితో వెళ్లిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మార్చి 30న పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తన ప్రియుడితో కలిసి ఆమె జడ్చర్లలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. జహీరాబాద్‌కు తీసుకువచ్చేందుకు పోలీసులు, భర్త కలిసి వెళ్లారు. ఆమెను తీసుకుని కారులో జడ్చర్ల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. జడ్చర్ల నుంచి వస్తున్న సమయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో కారు సదాశివపేట మండలం నందికంది వద్దకు చేరుకున్న సమయంలో భర్త భార్య గొంతు కోసి చంపేశాడు.

# బండి సంజయ్‌పై వేముల వీరేశం విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): కేంద్ర మంత్రి బండి సంజయ్ పై తెలంగాణ ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నియోజకవర్గాల పునర్విభజన, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న పోరాటాన్ని సమర్థిస్తూ, బీజేపీ వైఖరిని ఆయన తప్పుబట్టారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ప్రజల తరఫున సీఎం మాట్లాడుతుంటే, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ ఆ నష్టాన్ని అడ్డుకుంటామని చెప్పాల్సింది పోయి, సీఎంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశభక్తి కేవలం తనకే ఉన్నట్లు బండి సంజయ్ మాట్లాడుతున్నారని... కానీ, దేశం కోసం రక్తాన్ని ధారపోసిన చరిత్ర గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీదని ఆయన గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న వాస్తవాలకు బీజేపీ నాయకులు భయపడుతున్నారని, అందుకే అవాకులు చెవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్, ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయాలని, పని చేయడం చేతకాకపోతే సీఎంతో కలిసి పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రిపై అనవసర విమర్శలు మానుకోవాలని, వాస్తవాలను గ్రహించి రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడాలని హితవు పలికారు.



# బాసరలో మనవడికి రేవంత్ అక్షరాభ్యాసం




బాసర, ఏప్రిల్ 6 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో తన మనవడు రియాన్ష్ (రుద్రదేవ్)కు అక్షరాభ్యాసం చేయించారు. ముఖ్యమంత్రి సోమవారం బాసరలో పర్యటించి ఆలయ అభివృద్ధి పనులకోసం భూమిపూజ చేశారు. కుటుంబంతో సహా ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ మహారాజ్... రియాన్ష్ కు పలక బలపంతో అక్షరాభ్యాసం చేయించారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, వారి కుమార్తె నైమిశా రెడ్డి దంపతులతో పాటు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, తన మనవడికి తల్లిదండ్రులు రియాన్ష్ అని పేరు పెట్టగా, తాను మాత్రం రుద్రదేవ్ అని పిలుచుకుంటానని ఒక సందర్భంలో ముఖ్యమంత్రి చెప్పారు.

## నా పార్టీకి అండగా ఉండండి

**బంజారా నేతలతో కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపుతూ, ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. అన్ని వర్గాల మద్దతు కూడగట్టే పనిలో భాగంగా, సోమవారం ఆమె హైదరాబాద్‌లో బంజారా సామాజిక వర్గ ప్రముఖులతో భేటీ అయ్యారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత... ఆయనతో పాటు పలువురు బంజారా ప్రముఖులతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తన కొత్త రాజకీయ ప్రయాణానికి మద్దతు తెలపాలని ఈ సందర్భంగా ఆమె వారిని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మంత్రివర్గంలో బంజారాలకు ప్రాతినిధ్యం లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయమని ఆమె పేర్కొన్నారు. తమ పార్టీలో బంజారాలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రముఖుల నుంచి సలహాలు, సూచనలు కోరుతున్నామని కవిత అన్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనుకునే బంజారా యువతను, నేతలను తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కవిత పిలుపునిచ్చారు.



# ప్రజావాణిలో గంగవ్వ

### రైతులకు మద్ధతుగా వినతిపత్రం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): బిగ్ బాస్ ఫేం, మై విలేజ్ షో ద్వారా తెలుగు ప్రజలకు దగ్గరైన గంగవ్వ జగిత్యాల కలెక్టరేట్‌కు వెళ్లారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తన స్వగ్రామమైన మల్యాల మండలం లంబాడిపల్లెలో ఐకేపీ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని గ్రామస్తులతో కలిసి సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తమ ఊరిలో వడ్ల కొనుగోలు కేంద్రం లేకపోవడంతో పండించిన పంటను ఎక్కడ పోయాలో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత స్థలం లేక పంట సమయంలో వేరు వేరు ప్రాంతాల్లో తాత్కాలికంగా కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నామని వెల్లడించారు. దీనివల్ల ధాన్యం సేకరణలో గందరగోళం ఏర్పడడమే కాకుండా సౌకర్యాలు కూడా లేకుండా తనతోపాటు తోటి రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటయితే రైతు సమస్యలు తీరుతాయని అన్నారు. తమకు స్థలం కేటాయిస్తే ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా తమ గ్రామ రైతులు, రైతు మిత్ర సంఘాల సహకారంతో స్వచ్ఛందంగా నిధులు సమకూర్చుకొని అభివృద్ధి చేసుకోవడానికి తాము సిద్ధంగా ఉ న్నామని ఆమె వినతిపత్రంలో వెల్లడించారు. ఆమె ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఐకేపీ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించాలని స్థానిక ఎమ్మార్వోకు ఆదేశాలు జారీ చేశారు. తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన కలెక్టర్‌కు గంగవ్వతోపాటు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## అక్రెడిటేషన్ల దరఖాస్తు

# నిరంతర ప్రక్రియ

**ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక**

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూటినీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని, కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.



## కొండగట్టు అంజన్న ఆలయానికి గజవాహనం విరాళం

మల్యాల, ఏప్రిల్ 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి గోదావరిఖనికి చెందిన శ్రీకాంత్-లత దంపతులు భక్తి భావంతో గజవాహనాన్ని సమర్పించారు. ఈ గజవాహనం సుమారు రూ.80,000 విలువ కలిగి ఉండగా, స్వామివారి సేవల కోసం ప్రత్యేకంగా అందజేశారు. సోమవారం సాయంత్రం ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనారెడ్డికిఈ గజవాహనాన్ని అప్పగించారు. ఆలయంలో జరిగే ఉత్సవాలు, ప్రత్యేక పూజల సందర్భంగా స్వామివారి సేవలో ఈ గజవాహనం ఉపయోగపడనుంది. కార్యక్రమంలో స్థానాచారి కపిందర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## జగిత్యాలలో ఉత్సాహంగా గ్రాడ్‌బ్యాష్ 2కే26

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల 'గ్రాడ్‌బ్యాష్ 2కే26' గ్రాండ్‌గా జరిగింది. పట్టణంలోని వాసవి గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల వీడ్కోలు, స్నాతకోత్సవం నిర్వహించారు. సిగ్నేచర్ డే సంబురాలు చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ మాట్లాడుతూ.. వీడ్కోలు అనేది విద్యకు ముగింపు కాదని, ఒక దశ నుండి మరొక దశకు మారడమే వీడ్కోలు అని, నిరంతరం అభ్యసించిన వాళ్లే గెలుపు బాటలో పయనిస్తారని అన్నారు. విద్యార్థులంతా ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ప్రణాళిక ప్రకారం కష్టపడితే ఏదైనా సాధించవచ్చు అని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేశ్, ప్రిన్సిపల్ కొక్కుల రాజేందర్, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## 'మావిగన్' జగన్ పిచ్చికి నిదర్శనం

**యాడికి సభలో సీఎం చంద్రబాబు**

అనంతపురం, ఏప్రిల్ 6 (ఈవార్తలు): దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న అనంతపురం జిల్లాలో శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నీటి భద్రత కల్పించడం ద్వారా రాయలసీమ రూపురేఖలు మార్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన ప్రకటించారు. సోమవారం అనంతపురం జిల్లా యాడికిలో నిర్వహించిన 'నీటి భద్రత-రైతు సంఘాల బాధ్యత' కార్యాచరణ ప్రారంభ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంద రోజుల ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు తన వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని, దానిని సమష్టిగా సాధిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ఒకే రాజధాని ఉంటుందని, అదే అమరావతి అని చంద్రబాబు మరోసారి పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ మూడు రాజధానుల విధానాన్ని 'మూడు ముక్కలాట'గా అభివర్ణించారు. "గతంలో మీ రాజధాని ఏదని బయట అడిగితే చెప్పలేక నామోషీ పడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు గర్వంగా నా రాజధాని అమరావతి అని చెప్పుకునే ధైర్యం వచ్చింది" అని అన్నారు. దేవతల రాజధాని అయిన అమరావతి పేరు పలకడానికి కూడా ఇష్టం లేని వాళ్లు రాష్ట్రాన్ని నాశనం చేశారని, ప్రత్యర్థి పార్టీ నేత అమరావతిని 'మావిగన్' అనడం ఆయన పిచ్చికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సభలో చంద్రబాబు తనదైన శైలిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయం ఆధారంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. తాడిపత్రి నియోజకవర్గంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (76 శాతం), హౌసింగ్ (72 శాతం) వంటి శాఖలు ఉత్తమ పనితీరు కనబరచాయని అభినందించారు. అదే సమయంలో, జిల్లా స్థాయిలో పనితీరు బాగాలేని అధికారులను వేదికపైనే నిలదీశారు.

## గూగుల్ డేటా సెంటర్‌కు 28న శంకుస్థాపన

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్.. విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 28న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ కూడా హాజరుకానున్నారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీ ఇన్‌ఫ్రా సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ఈ డేటా సెంటర్ కోసం మొత్తం 15 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.27 లక్షల కోట్లు) పెట్టుబడిగా పెట్టనున్నారు. దీనిని 1000 మెగావాట్ల సామర్థ్యంతో అభివృద్ధి చేయనున్నారు. శంకుస్థాపన అనంతరం నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమవుతాయి. ఈ భారీ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విశాఖ పరిధిలోని మూడు ప్రాంతాల్లో 601.4 ఎకరాల భూమిని కేటాయించింది.

# ఉచితంగా సమగ్ర ఆరోగ్య సేవలు

**ప్రజలకు అందుబాటులో క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు**



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఈవార్తలు): ప్రజల ఆరోగ్య రక్షణ లక్ష్యంగా ఉచితంగా సమగ్ర వైద్య సేవలను అందిస్తున్నట్లు డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపారు. ముషీరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సేవలు, పిల్లల టీకాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి పలు సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. సాధారణ ఓపీ సేవల కింద జ్వరం, దగ్గు, జలుబు, శరీర నొప్పులు, థైరాయిడ్ సమస్యలు, రక్తపోటు, మధుమేహం, చెవి సమస్యలు, కంటి సమస్యలు, విరేచనాలు, వాంతులు వంటి సమస్యలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రోగులకు అవసరమైన మందులు కూడా ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలకు ఉ చిత ల్యాబ్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఇందులో సీబీపీ, ఎల్ఎఫ్టీ, ఆర్ఎఫ్టీ, ఎఫ్‌బీఎస్, పీఎల్‌బీఎస్, థైరాయిడ్ ప్రొఫైల్, విటమిన్ బీ12, విటమిన్ డీ3, డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ పరీక్షలు ఉన్నాయి. గర్భిణీ స్త్రీలకు ఉచిత ఏఎన్‌సీ చెకప్‌లు, అవసరమైన మందులు, ల్యాబ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పిల్లలకు అవసరమైన అన్ని రకాల టీకాలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. 30 సంవత్సరాల పైబడిన వారికి ఎన్సీడీ స్క్రీనింగ్ నిర్వహిస్తూ రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, స్తన క్యాన్సర్, గర్భాశయ ముఖ క్యాన్సర్ వ్యాధులను గుర్తించే పరీక్షలు చేస్తున్నారు. టీబీ పరీక్షలు మరియు ఉచిత మందులు, కుష్టు వ్యాధి స్క్రీనింగ్ మరియు చికిత్స కూడా అందిస్తున్నారు. టెలీమెడిసిన్ సేవల ద్వారా నిపుణులైన వైద్యులతో ఉచిత ఆన్‌లైన్ కన్సల్టేషన్ సౌకర్యం కల్పించారు. టెలీ మానస్ ద్వారా మానసిక ఆరోగ్య సమస్యలకు సైకియాట్రిస్టులతో సంప్రదింపులు చేసుకోవచ్చు. గర్భిణీ స్త్రీల కోసం 102 అంబులెన్స్ సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ప్రతి గురువారం వృద్ధులకు ప్రత్యేక జీరియాట్రిక్ ఓపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంచేందుకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఉచిత యోగా శిక్షణ కూడా అందిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## బెస్ట్ అవైలబుల్ నిధులు విడుదల చేయాలి

**ఖమ్మం ప్రజావాణిలో విద్యార్థుల తల్లిదండ్రుల వినతి**

ఖమ్మం, ఏప్రిల్ 6 (ఈవార్తలు): ఖమ్మం పట్టణంలో ప్రైవేట్ స్కూళ్లలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే (బెస్ట్ అవైలబుల్ పథకం నిధులు) వెంటనే విడుదల చేయాలని తల్లిదండ్రులు విన్నవించారు. ఖమ్మం పట్టణంలోని స్థానిక సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో చదివే విద్యార్థులకు సంబంధించిన నిధులు ఇంకా విడుదల కాలేదని తెలిపారు. గత ఆరేళ్లుగా డబ్బులు అందడం లేదని, వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ డీడీకి కూడా వినతి పత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యార్థుల తల్లిదండ్రులు మాతంగి అనిల్ కుమార్, విజయ్ కుమార్, రాంబాబు, రామకృష్ణ, గోపి, రూప, సావిత్రి, వెంకన్న, జగదీశ్ తదితరులు ఉన్నారు.

# పంచాయతీ కార్యదర్శుల పేస్కేల్ తగ్గింపు

**షాకిచ్చిన ఏపీ ప్రభుత్వం**

విజయవాడ, ఏప్రిల్ 6 (ఈవార్తలు): ఏపీలోని పంచాయతీ కార్యదర్శులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. జీవో 91 సవరిస్తూ.. పంచాయతీ కార్యదర్శుల పేస్కేల్‌ను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ 5, గ్రేడ్ 4 నుంచి పీడీవో గ్రేడ్ -3కు ఇటీవల అప్ గ్రేడ్ చేసిన ఏపీ ప్రభుత్వం.. వారి పేస్కేల్‌ను రూ.28,280కు పెంచింది. అయితే తాజాగా జీవో 91 సవరించిన ఏపీ ప్రభుత్వం.. పంచాయతీ కార్యదర్శుల పేస్కేల్‌ను రూ.28280 నుంచి రూ. 25220 తగ్గిస్తూ జీవో 60 జారీ చేసింది. దీనిపై రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులు మండిపడుతున్నారు. జీవో 60ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో 359 రూర్బన్ పంచాయతీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గ్రేడ్-4, గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులను పీడీవో గ్రేడ్-3గా ఇటీవల అప్‌గ్రేడ్ చేశారు. అలాగే వారి పేస్కేల్ కూడా రూ.28,280కు పెంచారు. పంచాయతీల్లోనూ పట్టణ తరహా పరిపాలన, పౌర సేవలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం పంచాయతీల పునర్విభజన చేపట్టింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 359 రూర్బన్ పంచాయతీలను ఎంపిక చేసింది. పదివేల మందికిపైగా జనాభా, ఏడాదికి కోటి రూపాయలకు పైగా ఆదాయం కలిగిన పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా ఎంపిక చేశారు. వీటికోసం డిప్యూటీ ఎంపీడీవో, సీనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించి, వారికి గెజిటెడ్ హోదా కల్పించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూర్బన్ పంచాయతీలలో కొత్తగా ప్రణాళిక విభాగం, ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. రోడ్లు, భవనాలు, కాలువల నిర్మాణం వంటి పనులను ఇంజనీరింగ్ విభాగం చేపట్టనుంది. ప్రజారోగ్య విభాగం కింద చెత్త సేకరణ, పారిశుద్ధ్యం వంటి పనులు ఉంటాయి. ప్రణాళికబద్ధమైన అభివృద్ధిని ప్రణాళిక విభాగం, వనరుల సమీకరణలో రెవెన్యూ విభాగం పనిచేస్తాయి. పంచాయతీలలో ఈ విభాగాలలో పనిచేసే సిబ్బందిని వారి ఆసక్తి అనుగుణంగా సర్దుబాటు చేస్తారు. పునర్విభజన తర్వాత ఏపీలో రూర్బన్ పంచాయతీలు 359, గ్రేడ్ -1 పంచాయతీలు 3.082, గ్రేడ్ -2 పంచాయతీలు 3,163, గ్రేడ్ -3 పంచాయతీలు 6,747 ఉండనున్నాయి. పునర్విభజన నేపథ్యంలోనే గ్రేడ్ 4, గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ -3గా ప్రమోషన్లు కల్పించారు. అయితే ప్రమోషన్లు కల్పించినట్లే కల్పించి.. ఇలా పేస్కేల్ తగ్గించటం ఏమిటంటూ పంచాయతీ కార్యదర్శులు మండిపడుతున్నారు. జీవో 60 వెంటనే ఉ పసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కొడుకు కళ్లెదుటే తండ్రి హత్య

**రాత్రంతా మృతదేహం పక్కనే పిల్లాడు**




అన్నమయ్య జిల్లా, ఏప్రిల్ 6 (ఈవార్తలు): కళ్లు తెరిచి చూస్తే కటిక చీకటి... చుట్టూ దట్టమైన అడవి... పక్కనే తండ్రి విగతజీవిగా పడి ఉన్నాడు. ఆ ఐదేళ్ల చిన్నారికి ఏం జరిగిందో అర్థం కాలేదు. భయంతో వణికిపోతూ, నాన్నను లేపేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. తన కళ్లెదుటే తండ్రిని కొందరు దుండగులు హత్య చేస్తుంటే ఆ లేత హృదయం పడిన ఆవేదన వర్ణనాతీతం. రాత్రంతా ఆ చిట్టడవిలో తండ్రి శవం పక్కనే ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ గడిపిన ఆ బాలుడి గాథ అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఈ ఘటన అన్నమయ్య జిల్లాలో వెలుగుచూసింది. అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలం, బోయకొండ అటవీ ప్రాంతంలో ఈ హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, తమిళనాడులోని గుడియాత్తంకు చెందిన గాంధీ, తన ఐదేళ్ల కుమారుడితో పాటు మరికొందరితో కలిసి మద్యం సేవించడానికి బోయకొండ అడవికి వెళ్లాడు. మద్యం తాగిన తర్వాత వారి మధ్య తలెత్తిన వివాదం చివరకు గాంధీ హత్యకు దారితీసింది. నిందితులు అతడిని దారుణంగా కొట్టి చంపి, అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, ఈ ఘోరమంతా కళ్లారా చూసిన ఆ చిన్నారిని అక్కడే వదిలేశారు. రాత్రంతా భయంతో గడిపిన బాలుడు, ఉదయం కాగానే ధైర్యం కూడగట్టుకున్నాడు. సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఆ అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ, సమీపంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్నాడు. అక్కడ టీచర్‌ను చూసి, తన తండ్రిని ఎవరో కొట్టారని, అప్పటి నుంచి లేవడం లేదని తన పసిపసి మాటలతో చెప్పాడు. బాలుడి మాటలతో ఆందోళనకు గురైన టీచర్, వెంటనే అతనితో పాటు ఘటనా స్థలానికి వెళ్లింది. అక్కడ రక్తపు మడుగులో పడి ఉన్న గాంధీ మృతదేహాన్ని చూసి షాక్‌కు గురై, పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. బాలుడిని అక్కున చేర్చుకుని, జరిగిన దానిపై ఆరా తీశారు. ప్రాథమిక విచారణలో ఈ హత్య వెనుక వివాహేతర సంబంధం కోణం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య కూడా పరారీలో ఉండటంతో అనుమానాలు బలపడుతున్నాయి. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కన్నతండ్రి హత్యకు గురైతే, ఆ శవం పక్కనే రాత్రంతా గడిపిన చిన్నారి పరిస్థితి తలచుకుని స్థానికులు తీవ్రంగా చలించిపోతున్నారు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తిస్థాయి దర్యాప్తు తర్వాత మరిన్ని వివరాలు వెల్లడవుతాయని తెలిపారు.

## జగన్ ప్రతిపాదన అవినీతిపై 'గన్': కన్నబాబు

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' కాన్సెప్ట్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబులో వణుకు మొదలైందని మాజీ మంత్రి కన్నబాబు విమర్శించారు. విశాఖపట్నంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో అద్భుతమైన రాజధానిని నిర్మించవచ్చనే జగన్ ఆలోచన కూటమి ప్రభుత్వానికి మింగుడు పడటం లేదని ఎద్దేవా చేశారు. అమరావతి కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం... మరోవైపు రాష్ట్రంలో జీతాలకు కూడా డబ్బులు లేవని ఆర్థిక మంత్రి ద్వారా చెప్పించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అమరావతిపై చంద్రబాబు చేస్తున్న ఖర్చు కేవలం అవినీతి కోసమేనని, జగన్ ప్రతిపాదన ఆ అవినీతిపై ఎక్కుపెట్టిన 'గన్'లా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి అమరావతిని 'కమ్మరావతి' అని సంబోధించినా కూటమి నేతలు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు.

## 'మావిగన్'తో ప్రభుత్వానికి భయం: కాకాణి

నెల్లూరు, ఏప్రిల్ 6 (ఈవార్తలు): వైసీపీ నాయకుల వ్యక్తిగత జీవితాలు, మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ఏబీఎన్ రాధాకృష్ణపై ధ్వజమెత్తారు. వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన 'మావిగన్'పై ప్రజల్లో జరుగుతున్న చర్చను చూసి కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుందని కాకాణి విమర్శించారు. ఆ చర్చను పక్కదారి పట్టించేందుకే వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. ఏబీఎన్ రాధాకృష్ణ తన 'కొత్త పలుకు' ద్వారా వైసీపీ నేతల కుటుంబ సభ్యులపై, ముఖ్యంగా మహిళలపై విషం చిమ్ముతున్నారని కాకాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిజం ముసుగులో రాధాకృష్ణ దళారీ పనులు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం మహిళల వ్యక్తిగత జీవితాలను కించపరచడం అత్యంత నీచమైన చర్య అని, దీనిని రాష్ట్రంలోని మహిళా లోకం ఛీత్కరించుకుంటోందని పేర్కొన్నారు. జగన్‌ను ఎంత ఎక్కువగా దూషిస్తే కూటమి ఎమ్మెల్యేలకు అంత మెరుగైన ర్యాంకింగ్స్ ఇస్తామని చంద్రబాబు టార్గెట్లు పెట్టారని కాకాణి ఎద్దేవా చేశారు. జగన్‌ను తిట్టడమే వారి లక్ష్యంగా మారిందని అన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సోషల్ మీడియాలో వైసీపీపై నెగెటివ్ ట్రోలింగ్ చేయిస్తున్నారని, ఇదంతా ప్రజల దృష్టిని మళ్లించేందుకేనని ఆయన ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలాంటి క్షుద్ర విద్యలు త్వరలోనే మళ్లీ వైఎసీపీ అధికారంలోకి రావడం, జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని కాకాణి ధీమా వ్యక్తం చేశారు.

## దుర్గమ్మకు అమరావతి రైతుల మొక్కులు

విజయవాడ, ఏప్రిల్ 6 (ఈవార్తలు): ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించిన నేపథ్యంలో, ఆ ప్రాంత రైతులు, మహిళలు విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ కాలినడకన భారీ యాత్ర చేపట్టారు. రాజధానిగా అమరావతికి చట్టపరమైన గుర్తింపు లభించడం, అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో తమ ఇష్టదైవానికి మొక్కులు చెల్లించుకున్నారు. కనకదుర్గమ్మ వారధి నుంచి ఇంద్రకీలాద్రి వరకు సాగిన ఈ యాత్ర 'జై అమరావతి' నినాదాలతో మార్మోగింది. మహిళలు సాంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు, చీర సారెను అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతుండటంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా తాము పడ్డ కష్టానికి ఫలితం దక్కిందని, రాజధాని ప్రాంతం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.

# వ్యాధుల వలయంలో నేటి తరం



- ముత్యాల సురేశ్, సీనియర్ జర్నలిస్ట్
ఫోన్: 9912715325

**ఆరోగ్యమే మహాభాగ్యం అనేది కేవలం నానుడి మాత్రమే కాదు, మన జీవితానికి అసలైన పునాది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి, కలుషిత ఆహారం, శారీరక శ్రమ లేకపోవడంతో అనేక వ్యాధులు దరి చేరుతున్నాయి. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు యువతలో కూడా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మనం తీసుకునే ఆహారం, చేసే వ్యాయామమే మన ఆరోగ్యాన్ని నిర్ధారిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మంగళవారం (ఏప్రిల్ 7) ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..**

### చరిత్ర, నేపథ్యం ఇదే..

ఏటా ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' నిర్వహిస్తారు. 1948లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటైన రోజును పురస్కరించుకొని ఈ దినోత్సవాన్ని నిర్ణయించారు. అయితే, మొదటి ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని మాత్రం 1950లో నిర్వహించారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడమే హెల్త్ డే ప్రధాన ఉద్దేశం.

### ఏటా పెరుగుతున్న మరణాలు

ప్రపంచవ్యాప్తంగా ఏటా సంభవిస్తున్న మరణాలలో సుమారు 70% కంటే ఎక్కువ మరణాలకు అనారోగ్యమే ప్రధాన కారణం. డబ్ల్యూహెచ్‌వో గణాంకాల ప్రకారం.. ఏటా దాదాపు 4.1 కోట్ల మంది అసంక్రమిత వ్యాధుల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందులో గుండె సంబంధిత వ్యాధులతో 1.79 కోట్లు, క్యాన్సర్‌తో 93 లక్షలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో 41 లక్షలు మంది మరణిస్తున్నారు. సరైన జీవనశైలి, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే మెజారిటీ మరణాలను నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.



### సంపూర్ణ ఆరోగ్యానికి సూత్రాలివే..

ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొన్ని మార్పులు చేసుకోవాలని డబ్ల్యూహెచ్‌వో సూచిస్తోంది. ముఖ్యంగా పండ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకుంటూ, జంక్ ఫుడ్, అధిక ఉప్పు, చక్కెరలకు దూరంగా ఉండాలి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేయాలి. అలాగే శారీరక, మానసిక పునరుజ్జీవనం కోసం రోజుకు 7 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరి. వీటితో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రమాదకరమైన అంటువ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఈ సరళమైన సూత్రాలను పాటించడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చు.

### ఈ ఏడాది థీమ్ ఇదే!

ప్రపంచ ఆరోగ్య సంస్థ 2026 ఏడాదికి గానూ 'టుగెదర్ ఫర్ హెల్త్.. స్టాండ్ విత్ సైన్స్' అనే శక్తివంతమైన నినాదాన్ని ప్రకటించింది. అశాస్త్రీయ సమాచారాన్ని వీడి, కేవలం వైద్య విజ్ఞానాన్ని మాత్రమే నమ్మాలని ఈ థీమ్ ఉద్దేశం. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని, ఆధునిక వైద్య ఫలాలు సామాన్యులకు అందాలని ఈ నినాదం పిలుపునిస్తోంది.

### మన ఆరోగ్యం - మన బాధ్యత

ఆరోగ్యం అనేది కేవలం ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో దొరికేది కాదు.. అది మనం తీసుకునే ఆహారం, మనం పాటించే క్రమశిక్షణ, ఆలోచనా సరళిపై ఆధారపడి ఉంటుంది. మన దైనందిన జీవితంలో చిన్నపాటి మార్పులు చేసుకుంటూ, మనతో పాటు మన కుటుంబాన్ని, సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేద్దాం. శాస్త్రీయ దృక్పథంతో ముందడుగు వేస్తూ, ఆరోగ్యవంతమైన రేపటిని నిర్మిద్దాం.

## ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖదేమీ మృతి

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇంటెలిజెన్స్ చీఫ్, మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ ఖదేమీ మరణించారు. సోమవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ ఘటనపై ఐఆర్‌జీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది నేరపూరిత ఉగ్రవాద దాడి అని, ఈ దాడిలో ఖదేమీ 'షహీద్' (అమరుడు) అయ్యారని పేర్కొంది. అయితే, దాడి ఎక్కడ జరిగిందనే ప్రదేశాన్ని మాత్రం ఐఆర్‌జీసీ వెల్లడించలేదు. ఇరాన్ భద్రతా వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన నిఘా విభాగానికి ఖదేమీ నాయకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి జరుగుతున్న దాడుల్లో ఇరాన్ అనేక మంది ఉన్నతాధికారులను కోల్పోయింది. గత నెలలోనే ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌లను ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. అంతకుముందు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పక్‌పూర్, బసీజ్ ఫోర్స్ చీఫ్ ఘోలామ్‌రెజా సొలైమానీ వంటి కీలక నేతలు కూడా ఈ దాడుల్లో మరణించారు. ఫిబ్రవరి 28న జరిగిన తొలి దాడిలోనే ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## ఇరాన్ కుర్దులు మోసం చేశారు: ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్‌లోని కుర్దులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌లో నిరసనకారులకు చేరవేసేందుకు తాము రహస్యంగా ఆయుధాలు పంపిస్తే, అవి వారికి చేరలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో నిరసనకారులకు ఆయుధాలు చేరవేయాలనే ఉద్దేశంతో కుర్దుల ద్వారా వాటిని పంపించామని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున తుపాకులు పంపించినట్లు తెలిపారు. కానీ ఈ ఆయుధాలు నిరసనకారులకు చేరలేదని అనుకుంటున్నానని, వాటిని కుర్దులు తమ వద్దనే ఉంచుకున్నట్లుగా ఉందని అసహనం వ్యక్తం చేశారు.

## పర్షియన్ గల్ఫ్ జలాల్లో 16 భారత నౌకలు

**ఇంకా 433 మంది భారతీయ నావికులు**

పశ్చిమ ఆసియా, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడున్న భారతీయుల భద్రత, తరలింపు ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం సోమవారం కీలక వివరాలు వెల్లడించింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 16 భారత నౌకలు, 433 మంది భారత నావికులు ఉన్నారని తెలిపింది. అయితే, గత రెండు రోజుల్లో 'గ్రీన్ శాన్వి', 'గ్రీన్ ఆశా' అనే రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్టు స్పష్టం చేసింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్), నౌకల యజమానులు, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు 1,599 మంది భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి రప్పించామని, వీరిలో గత 24 గంటల్లో 120 మంది ఉన్నారని తెలిపింది. మరోవైపు, గుజరాత్, మహారాష్ట్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని అన్ని పోర్టులలో కార్యకలాపాలు సాధారణంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగుతున్నాయని స్పష్టం చేసింది. ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం చొరవతో ఇప్పటివరకు 1,777 మంది భారతీయులను ఆ దేశం నుంచి ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లకు తరలించి, అక్కడి నుంచి స్వదేశానికి పంపే ఏర్పాట్లు చేసింది. వీరిలో 895 మంది విద్యార్థులు, 345 మంది మత్స్యకారులు ఉన్నారు. ఈ మత్స్యకారులు ఏప్రిల్ 4న ఆర్మేనియా నుంచి చెన్నైకి చేరుకున్నారు. తరలింపు ప్రక్రియకు సహకరించిన ఇరాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్ ప్రభుత్వాలకు భారత్ కృతజ్ఞతలు తెలిపింది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు యుద్ధ ప్రభావిత ప్రాంతాల నుంచి సుమారు 7,30,000 మంది ప్రయాణికులు భారత్‌కు తిరిగి వచ్చారు. యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్ నుంచి భారత్‌కు విమాన సర్వీసులు పరిమిత సంఖ్యలో కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వివరించింది. భారతీయుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని కేంద్రం పునరుద్ఘాటించింది.



## నాసా ఆర్టెమిస్-2 సరికొత్త చరిత్ర

న్యూయార్క్: అంతరిక్ష ప్రయాణ చరిత్రలో మానవులు మరో అద్భుతమైన మైలురాయిని అందుకోబోతున్నారు. నాసా ఆర్టెమిస్-2 మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములతో కూడిన బృందం, ఇప్పటివరకు మనుషులు ప్రయాణించిన దూరాన్ని అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఫ్లోరిడా నుంచి గత వారం ఆరియన్ క్యాప్సూల్‌లో బయల్దేరిన ఈ బృందం సోమవారం చంద్రుడి గురుత్వాకర్షణ క్షేత్రంలోకి విజయవంతంగా ప్రవేశించింది. భూమి నుంచి సుమారు 2,52,757 మైళ్ల దూరానికి ఈ బృందం చేరుకోనుంది. 1970లో అపోలో-13 మిషన్ నెలకొల్పిన రికార్డు కంటే ఇది 4,102 మైళ్లు ఎక్కువ. దీంతో మానవ అంతరిక్ష యానంలో ఇది ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోనుంది. నాసా వ్యోమగాములు రీడ్ వైజ్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్‌తో పాటు కెనడియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన జెరెమీ హాన్సెన్ ఈ బృందంలో ఉన్నారు. దాదాపు 10 రోజుల పాటు సాగే ఈ యాత్రలో వ్యోమగాములు చంద్రుడి చీకటి భాగం (ఫార్ సైడ్) మీదుగా ప్రయాణిస్తారు. ఆ సమయంలో చంద్రుడు రేడియో సిగ్నల్లను అడ్డుకోవడం వల్ల కొద్దిసేపు భూమితో సంబంధాలు తెగిపోతాయి. ఈ ప్రయాణంలో చంద్రుడి అంచుల నుంచి భూమి ఉదయించడం (ఎర్త్‌రైజ్) వంటి అరుదైన, అద్భుతమైన దృశ్యాలను తమ కెమెరాలలో బంధించనున్నారు. 2028 నాటికి చంద్రుడిపై మళ్లీ మనిషిని దించాలనే బృహత్తర లక్ష్యంతో నాసా చేపట్టిన ఆర్టెమిస్ కార్యక్రమంలో ఈ యాత్ర ఒక కీలక ముందడుగు. భవిష్యత్తులో చంద్రుడిపై దీర్ఘకాలిక స్థావరం ఏర్పాటు చేయడం, అంగారక గ్రహ యాత్రలకు సన్నాహాలు చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశాలు. హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలు ఈ మిషన్‌ను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.



## ఎక్కడికెళ్లినా యూపీఐతోనే..!

**2025లో 33 శాతం పెరిగిన లావాదేవీలు**

న్యూఢిల్లీ: భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. 2025 సంవత్సరంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా జరిగిన లావాదేవీలు 33 శాతం వృద్ధి చెంది 228.5 బిలియన్లకు చేరాయి. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ.299.74 ట్రిలియన్లుగా నమోదైంది. ఈ వివరాలను 'వరల్డ్‌లైన్' సోమవారం విడుదల చేసిన తన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం, వ్యాపారులకు జరిపిన చెల్లింపులు 34 శాతం పెరిగి 143.82 బిలియన్లకు చేరాయి. మరోవైపు, యూపీఐ సగటు లావాదేవీ విలువ (యావరేజ్ టికెట్ సైజ్) 9 శాతం తగ్గి రూ.1,314కు చేరింది. ముఖ్యంగా వ్యాపారుల వద్ద జరిపే చెల్లింపుల సగటు విలువ రూ.592కు పడిపోవడం గమనార్హం. గతంలో నగదుతో జరిపిన వీధి వ్యాపారుల వద్ద కొనుగోళ్ల వంటి చిన్న చిన్న చెల్లింపులు కూడా డిజిటల్ పరిధిలోకి వస్తున్నాయని ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల కోసం మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. 2025లో యూపీఐ క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 15 శాతం పెరిగి 731.38 మిలియన్లకు చేరింది. "భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పరిణితిలో కొత్త దశకు చేరుకుంటోంది," అని వరల్డ్‌లైన్ ఇండియా సీఈవో రమేష్ నరసింహన్ తెలిపారు. మరోవైపు, భారత్ బిల్‌పే ద్వారా జరిగే రికరింగ్ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. దీని లావాదేవీల సంఖ్య 40 శాతం పెరిగి 3.05 బిలియన్లకు, వాటి విలువ 93 శాతం వృద్ధితో రూ.14.84 ట్రిలియన్లకు చేరింది. ఎడ్యుకేషన్ ఫీజులు, బీమా, ఈఎంఐల వంటివి దీని ద్వారా చెల్లించడం పెరుగుతోందని నివేదిక వివరించింది. ఇదే సమయంలో క్రెడిట్ కార్డు లావాదేవీలు 27 శాతం పెరగ్గా, చిన్న లావాదేవీలు యూపీఐకి మళ్లడంతో డెబిట్ కార్డుల వాడకం 23 శాతం తగ్గింది.




## క్రూడాయిల్ ధరలను భారీగా పెంచిన సౌదీ

రియాద్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో, చమురు ధరలకు రెక్కలు వస్తున్నాయి. తాజాగా సౌదీ అరేబియా క్రూడాయిల్ ధరలను పెంచింది. మే నెలకు గాను బెంచ్ మార్క్ ధర కంటే 19.50 డాలర్ల అధిక ధరకు ఆసియా రిఫైనరీలకు విక్రయిస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీనితో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు 50 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తున్న సౌదీ అరేబియా, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు కొనసాగే అవకాశాలు ఉండటంతో క్రూడ్ ధరలను పెంచింది. ఆసియా కొనుగోలుదారులకు సౌదీ ఆరామ్‌కో అధిక ధరకు విక్రయిస్తోందని బ్లూమ్‌బర్గ్ వార్తా కథనం పేర్కొంది. మే నెలలో చమురు ఉత్పత్తి కోటాను రోజుకు 2,06,000 బ్యారెళ్ల మేర పెంచడానికి చమురు ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్-ప్లస్ దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో ఒపెక్ కీలక సభ్య దేశాలు చమురు ఉత్పత్తిని పెంచే పరిస్థితుల్లో లేవు. ఒపెక్ సభ్యదేశాలైన సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఇరాక్ నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. క్షిపణి, డ్రోన్ దాడుల వల్ల గల్ఫ్ ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

## ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్ జోగి కుమారుడికి జీవిత ఖైదు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి అజిత్ జోగి కుమారుడు అమిత్ జోగికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 21 ఏళ్ల నాటి రామావతార్ జగ్గీ హత్య కేసులో ఆయన్ను దోషిగా తేల్చిన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు జీవిత ఖైదు విధించింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును కొట్టివేస్తూ ఈ సంచలన తీర్పును వెలువరించింది. అయితే, హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ అమిత్ జోగి సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2003 జూన్ 4న రాయ్‌పూర్‌లో ఎన్సీపీ నేత రామావతార్ జగ్గీ హత్యకు గురయ్యారు. అప్పట్లో అమిత్ జోగి తండ్రి అజిత్ జోగి ముఖ్యమంత్రిగా ఉన్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు జరిగిన ఈ హత్య, రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ఈ కేసులో 2007లో ట్రయల్ కోర్టు, సాక్ష్యాలు సరిగా లేవంటూ అమిత్ జోగిని నిర్దోషిగా విడుదల చేసింది. దీనిపై సీబీఐ పట్టువదలకుండా న్యాయపోరాటం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో కేసును పునర్విచారించిన హైకోర్టు, మార్చి 2న అమిత్ జోగిని దోషిగా తేల్చింది. "ఈ హత్య కుట్రకు అమిత్ జోగినే సూత్రధారి. అప్పటి ముఖ్యమంత్రి కుమారుడిగా ఆయన తన హోదాను ఉపయోగించుకున్నారు" అని హైకోర్టు తన తీర్పులో తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ట్రయల్ కోర్టు తీర్పు చట్టవిరుద్ధమని, వాస్తవాలకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అమిత్ జోగి సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఏప్రిల్ 20లోగా అప్పీల్ దాఖలు చేయాలని ధర్మాసనం సూచించింది. అన్ని అంశాలను కలిపి విచారించి తుది తీర్పు ఇస్తామని పేర్కొంది.

## ప్రింట్ మీడియా యాడ్స్‌పై ఈసీ కఠిన నిబంధనలు

న్యూఢిల్లీ: మరికొన్ని రోజుల్లో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారాన్ని స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే లక్ష్యంతో ప్రింట్ మీడియాలో ఇచ్చే రాజకీయ ప్రకటనలపై కఠిన నిబంధనలు విధించింది. పోలింగ్ రోజు, దానికి ఒక రోజు ముందు ఇచ్చే ప్రకటనలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేసింది. ఈ నిబంధనల ప్రకారం, రాష్ట్ర లేదా జిల్లా స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఏ రాజకీయ పార్టీ, అభ్యర్థి లేదా సంస్థ ప్రకటనలు ప్రచురించకూడదు.



## తెలుగోళ్ల టాలెంట్‌ను తొక్కేస్తున్నారు: జేడీ చక్రవర్తి

టాలీవుడ్ ఆర్టిస్ట్‌లని విస్మరిస్తూ కొంత మంది డైరెక్టర్లు, నిర్మాతలు పర భాషలకు చెందిన నటీనటులని ఎక్కువగా తెలుగు కోసం తీసుకొస్తున్నారని, దాని వల్ల తెలుగులో ఉన్న టాలెంటెడ్ ఆర్టిస్ట్‌లకు పని లేకుండా పోతోందనే కామెంట్‌లు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. కోట శ్రీనివాసరావు లాంటి నటులు బాహాటంటానే దీనిపై కామెంట్‌లు చేశారు. ప్రకాష్ రాజ్ లాంటి పర భాష నటులని ప్రోత్సహిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని విమర్శలు గుప్పించారు. తాజాగా ఇదే తరహా ప్రశ్న జెడీ చక్రవర్తికి ఎదురైతే ఆయన ఆసక్తికరంగా స్పందించారు. చాలా కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటూ వస్తున్న జెడీ చక్రవర్తి తెలుగులో తరుణ్ భాస్కర్ కథానాయకుడిగా నటించిన -గాయపడ్డ సింహం-లో నటించారు. మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జేడీ చక్నవర్తి పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు ఆర్టిస్ట్‌లను పక్కన పెట్టి పర భాష నటులను తీసుకుంటున్నారు అన్నది కరెక్ట్ కాదు. మా లాంటి నటులను ముందుగా అప్రోచ్ అయినా మా లాంటి వాళ్లు కొన్ని సార్లు నో చెప్పడం వలన వేరే భాష నటులకు వెళ్లివుండవచ్చు- అన్నారు. లేదా కొన్ని సందర్భాలలో ఆ క్యారెక్టర్‌కు వాళ్లు మాత్రమే సరిపోతారని భావించి దర్శకుడు తీసుకున్న నిర్ణయం కూడా అయివుండోచ్చు. అంతే కానీ మన తెలుగు వాళ్లని పక్కన పెట్టి పర భాష నటుల కోసం వెళుతున్నారు అనేది కరెక్ట్ కాదు. క్యారెక్టర్ ఫిట్‌నెస్ అనేది ఒకటి ఉ ంటుంది. కొన్ని క్యారెక్టర్లకు దర్శకుడు ఎవరిని అనుకుంటున్నారో వాళ్లే సరిపోతారు- అన్నారు.






## హిస్టరీల ధురంధర్!

ధురంధర్ 2 థియేటర్లలో రన్ మొదలై 18 రోజులు గడుస్తున్నా, ఆడియన్స్ డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు. ఒకవైపు కొత్త సినిమాలు పోటీగా వస్తున్నా, 'ధురంధర్' తన పట్టును నిలబెట్టుకుంటూ వేయి కోట్ల నెట్ వసూళ్ల మార్కును దాటేసింది. ఇండియాలో ఇప్పటివరకు ఏ సినిమాకు సాధ్యం కాని రీతిలో కేవలం మూడు వారాల్లోనే ఈ ఫీట్ సాధించడం విశేషం. అసలు విషయానికి వస్తే, 'ధురంధర్: ది రివెంజ్' భారత్ లో 1000 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన తొలి చిత్రంగా రికార్డ్ సృష్టించింది. మూడు వారాల ముగిసేసరికి ప్రపంచవ్యాప్తంగా రూ. 1,622 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టి గ్లోబల్ హిట్ గా నిలిచింది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో 25 మిలియన్ డాలర్లు, జర్మనీలో 1 మిలియన్ యూరోలు దాటిన తొలి ఇండియన్ సినిమాగా నిలిచింది. జియో స్టూడియోస్, బి62 స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం కేవలం 10 రోజుల్లోనే మొదటి భాగం లైఫ్ టైమ్ ఓవర్సీస్ కలెక్షన్లను అధిగమించింది. సినిమాలోని విజువల్స్ యాక్షన్ సీక్వెన్స్ లు హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉన్నాయి. యాక్షన్ బ్లాక్స్ లో రణవీర్ బాడీ లాంగ్వేజ్, ఆ ఇంటెన్సిటీ సినిమాకు మెయిన్ పిల్లర్ అని చెప్పొచ్చు. ట్రైలర్ లో చూసిన ఆ భారీ పేలుళ్లు, చేజింగ్ సీన్లు వెండితెరపై ఒక అద్భుతమైన అనుభూతిని ఇస్తున్నాయి. క్వాలిటీ విషయంలో ఆదిత్య ధర్ ఎక్కడా రాజీ పడకుండా ఈ రివెంజ్ డ్రామాను ఒక విజువల్ స్పెక్టకిల్ లా తీర్చిదిద్దారు. ఈ లెక్కలు గమనిస్తే, సినిమా ఎంత స్ట్రాంగ్ గా బాక్సాఫీస్ వద్ద నిలబడిందో అర్థమవుతుంది. మూడో వీకెండ్‌లో కేవలం మూడు రోజుల్లోనే (శుక్ర, శని, ఆది) రూ. 80 కోట్లు రాబట్టింది.

## ప్రేమ లేకపోతే దేనికీ అర్థం లేదు: త్రిష



దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా దశాబ్దాలుగా రాణిస్తున్న త్రిష కృష్ణన్ వ్యక్తిగత జీవితంపై పుకార్ల గురించి తెలిసిందే. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే పార్టీ అధినేత విజయ్‌తో త్రిష ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఈ పుకార్లపై నేరుగా స్పందించని త్రిష తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేస్తున్న నిగూఢమైన పోస్టులు ఇటీవల నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పుడు కూడా అలాంటి మరో పోస్ట్ వాడి వేడి చర్చకు తెర తీసింది. --ప్రతిదీ ప్రేమ కాదు.. కానీ ప్రేమ లేకపోతే దేనికీ అర్థం ఉండదు-- అనే కోట్‌ను షేర్ చేసిన త్రిష దానికి -నిజం- అనే ట్యాగ్ ని ఇచ్చారు. దీనిని చూడగానే ఇది త్రిషలో నిగూఢంగా దాగి ఉన్న మరో మనిషి అప్రయత్నంగా చేసిన పోస్ట్ అంటూ అభిమానులు ఊహిస్తున్నారు. అయితే త్రిష- విజయ్ జంట కలిసి నాలుగు బ్లాక్ బస్టర్ సినిమాల్లో నటించారు. కోలీవుడ్ హిట్ పెయిర్‌గా మంచి గుర్తింపు ఉంది. ఈ జంట చాలా గ్యాప్ తర్వాత -లియో- అనే చిత్రంలోను కలిసి నటించారు. అప్పటి నుండి వీరిద్దరి మధ్య ఏదో ఉందనే వార్తలు ఊపందుకున్నాయి. విజయ్ పుట్టినరోజు సందర్భంగా త్రిష అతడితో దిగిన ఒక ప్రత్యేకమైన ఫోటోను షేర్ చేయడం.. ఇద్దరూ కలిసి విదేశీ పర్యటనలకు వెళ్తున్నారని నెటిజన్లు ఆరోపించడం ఈ పుకార్లకు మరింత ఆజ్యం పోసింది.


## నెగటివ్‌గా మాట్లాడితే కోపమొస్తుంది: జాన్వీ

తన ఫోటోలను కొన్ని యాంగిల్స్‌లో చూసి పాపరాజీలు, నెటిజన్స్ 'ఈమె హాట్‌గా లేదు, అందంగా లేదు' అంటూ కామెంట్ చేయడం వంటివి చేస్తే కోపం వస్తుందని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. తన గురించి ఇతరులు మాట్లాడుకోవడం పర్వాలేదు కానీ, తన గురించి పదే పదే నెగిటివ్‌గా మాట్లాడుకోవడం కోపం తెప్పిస్తుందని జాన్వీ కపూర్ అంది. తాను ఎన్నో ఫోటో షూట్స్‌లో హాట్‌గా అందంగా కనిపించాను. కొన్ని ఫోటోలను యాంగిల్ లేకుండా తీసి, ఇష్టానుసారంగా పోస్ట్ చేసిన పాపరాజీల ఫోటోలను చూసి కొందరు హాట్‌గా లేదని వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదు అన్నట్లుగా జాన్వీ కపూర్ అసహనం వ్యక్తం చేసింది. కంఫర్ట్ లేకుండా రకరకాల యాంగిల్స్ నుంచి ఫోటోలు తీయడం అనేది ఇబ్బందిగా అనిపిస్తుంది. ఆ ఫోటోలను వారు హాట్‌గా లేదని కామెంట్ పెట్టి పోస్ట్ చేయడంను జాన్వీ కపూర్ తప్పుబట్టింది.



## తమిళ నటి సుభాషిణి ఆత్మహత్య

బుల్లితెర నటి సుభాషిణి (36) ఆత్మహత్య ఘటన చెన్నైలో కలకలం సృష్టించింది. భర్తతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న సమయంలో జరిగిన వాగ్వాదం ఈ దారుణానికి దారితీసినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. చెన్నై పోరూరులోని ఒక ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సుభాషిణి, ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శ్రీలంకకు చెందిన సుభాషిణి, తన భర్త పిప్పిన్‌తో కలిసి బెంగళూరులో ఉ ండేది. అయితే వృత్తిరీత్యా షూటింగ్‌ల కోసం చెన్నైలోని పోరూరులో ఒంటరిగా ఉంటోంది. ప్రముఖ టీవీ సీరియల్ 'కయల్' ద్వారా ఆమె మంచి గుర్తింపు పొందింది. సోషల్ మీడియాలో, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉంది. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, నిన్న రాత్రి భర్తతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్నప్పుడు ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత మనస్థాపానికి గురైన ఆమె ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కుటుంబ సమస్యల కారణంగానే ఆమె గత కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నారని, అదే ఆత్మహత్యకు ప్రేరేపించి ఉండవచ్చని ఆమె సన్నిహితులు చెబుతున్నారు



## కొత్తగా కనిపిస్తా



పాన్-ఇండియా స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మరోసారి ఛాలెంజింగ్ పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. యాక్షన్, రొమాన్స్, ఎమోషన్‌ల మేళవింపుగా తెరకెక్కుతున్న డెకాయిట్ సినిమాలో ఆమె పోషించిన సరస్వతి రోల్ తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందని ఆమె చాలా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రిస్కీ యాక్షన్ స్టంట్స్ చేయడం ఈ సినిమాకు హైలైట్‌గా మారనుందని ఆమె చెప్పడం ఆసక్తిని పెంచుతోంది. ప్రమోషన్స్ లో భాగంగా మీడియా ముందుకొచ్చిన మృణాల్ పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. డెకాయిట్‌లో చేసిన సరస్వతి పాత్ర చాలా కాంప్లెక్స్ అని, కానీ మేకర్స్ దాన్ని యాక్టర్‌కు సులభంగా అర్థమయ్యేలా రూపొందించారని, ఛాలెంజింగ్ పాత్రలు చేయడమంటే తనకెప్పుడూ ఇష్టమేనని, ఈ క్యారెక్టర్ తనకు మంచి సంతృప్తినిచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ సినిమాలో కొన్ని రిస్కీ కొన్ని రిస్కీ స్టంట్స్ చేశానని, ఛేజింగ్ సీన్స్, డ్రైవింగ్ సీన్స్ ను చాలా ఎంజాయ్ చేశానని, ముఖ్యంగా హ్యాండ్ బ్రేక్ లేని అంబులెన్స్ ను డ్రైవ్ చేసే సీక్వెన్స్ చాలా థ్రిల్లింగ్‌గా అనిపించిందని చెప్పారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తన అనుబంధాన్ని కూడా మృణాల్ గుర్తు చేసుకున్నారు.


## ధోనీ బంధువుతో కృతి సనన్ లవ్ ఎఫైర్!

కృతి సనన్ ప్రేమ వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశం అవుతోంది. కృతి సనన్ వయసు 35 కాగా, ఆమె ప్రేమిస్తున్న కబీర్ బహియా వయసు దాదాపుగా 26 ఏళ్లు అనే వార్తలు వస్తున్నాయి. ఇద్దరి మధ్య వయసు తేడా 9 ఏళ్లు కావడంతో మీడియాలో ప్రముఖంగా వార్తలు వస్తున్నాయి. ప్రియాంక చోప్రా తన భర్త నిక్ కంటే ఏకంగా పదేళ్లు పెద్ద వయసు అనే విషయం తెల్సిందే. ఇండస్ట్రీలోనే ఇదే విధంగా



వయసు ఎక్కువ హీరోయిన్స్ తమ కంటే తక్కువ వయసున్న కుర్రాళ్లను పెళ్లి చేసుకోవడం జరిగింది. ఇప్పుడు కృతి సనన్ వంతు వచ్చిందంటూ జాబితాను కొందరు బయట పెడుతున్నారు. వయసులో తనకంటే 9 ఏళ్లు చిన్న కుర్రాడితో కృతి సనన్ ప్రేమలో పడటంను కొందరు విమర్శిస్తూ ఉంటే, అతడి వ్యాపార సామ్రాజ్యం ను చూసి ప్రేమలో పడిందంటూ కొందరు విమర్శిస్తున్నారు. మొత్తానికి కృతి సనన్ ను రకరకాలుగా సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న వారు ఎక్కువ అయ్యారు. ఈ సమయంలోనే కృతి ప్రేమిస్తున్న కబీర్ బహియా గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇతడు టీం ఇండియా మాజీ స్టార్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీకి బంధువు అవుతాడని తెలుస్తోంది. ధోనీ భార్య సాక్షి కి కబీర్ దగ్గర బంధువు అని బాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఈవార్తలు
క్రీడావాణి SPORTS
మంగళవారం 7-4-2026, జగిత్యాల www.evarthalu.com





# కోల్‌కతా, పంజాబ్ మ్యాచ్ రద్దు

## కోల్‌కతాలో భారీ వర్షం.. ఆటను రద్దు చేసిన అంపైర్లు

పంతొమ్మిదో సీజన్‌లో ఓటముల పరంపరకు చెక్ పెట్టాలనుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్ ఆశలు ఆవిరయ్యాయి. సొంత ఇలాకా ఈడెన్ గార్డెన్స్‌లో పంజాబ్ కింగ్స్ ను ఓడించి గెలుపు బాట పట్టాలనుకున్న కోల్‌కతాకు వరుణుడు షాకిచ్చాడు. మూడు గంటలకుపైగా వాన పడడంతో కనీసం ఐదు ఓవర్ల మ్యాచ్ నిర్వహించలేని పరిస్థితి. దాంతో, అంపైర్లు చివరకు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. టాస్ గెలిచిన కోల్‌కతా బ్యాటింగ్ ఎంచుకొని భారీ స్కోర్ చేయాలనుకుంది. కానీ, రెండో ఓవర్లోనే బార్ట్‌లెట్ రెండు వికెట్లతో షాకివ్వగా.. కాసేపటికే వరుణుడు నేను సైతం అని కోల్‌కతా ఇన్నింగ్స్‌కు అడ్డుపడ్డాడు. కోల్‌కతా ఇన్నింగ్స్ నాలుగో (3.4) ఓవర్‌లోనే ఆటకు అంతరాయం కలిగించిన వర్షం.. మూడు గంటల తర్వాత తెరిపినిచ్చింది. రాత్రి 10:30 తర్వాత వాన తగ్గడంతో సిబ్బంది కవర్లు తొలగించగా.. అంపైర్లు కనీసం ఐదు ఓవర్ల ఆట ఆడించాలని భావించారు. ఆ లెక్కన 11:14 గంటలకు ఐదు ఓవర్ల మ్యాచ్ ఆడిస్తారని అందరూ అనుకున్నారు. కానీ, ఔట్ ఫీల్డ్ చాలా చోట్ల నీళ్లు ఉండడంతో ఆట సాధ్యమయ్యే పరిస్థితి కనిపించలేదు. ఇదే విషయాన్ని కెప్టెన్లు అజింక్యా రహానే, శ్రేయాస్ అయ్యర్‌కు వివరించిన అంపైర్లు ఆట రద్దు చేస్తున్నట్టు చెప్పారు. ఇరుజట్లకు చెరొక పాయింట్ ఇస్తున్నట్టు చెప్పగా అందుకు అంగీకరించిన కెప్టెన్లు షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు. మ్యాచ్ రద్దవ్వడంతో హ్యాట్రిక్ విక్టరీ కొట్టాలనుకున్న పంజాబ్ నిరాశకు లోనవ్వగా. బోణీ చేయాలనుకున్న కోల్‌కతా సైతం 'ఫ్' అని నిట్టూర్చింది.



# హార్దిక్ తల్లితో ఫొటోలను షేర్ చేసిన నటాషా

టీమిండియా స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యాతో విడిపోయినప్పటికీ, ఆయన కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని నటి, మోడల్ నటాషా స్టాంకోవిక్ కొనసాగిస్తున్నారు. తాజాగా ఆమె తన మాజీ అత్తగారింటికి వెళ్లి, వారితో గడిపిన క్షణాలను ఫోటోల రూపంలో పంచుకున్నారు. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆదివారం రోజున నటాషా వడోదరలో పర్యటించారు. అక్కడ హార్దిక్ తల్లి, బామ్మ, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి దిగిన ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. "బరోడా కేమ్ చో? (బరోడా ఎలా ఉన్నావు?)" అనే గుజరాతీ క్యాప్షన్‌ను ఈ ఫోటోలకు జోడించారు. ఈ పర్యటనలో ఆమె కుమారుడు అగస్త్య కూడా ఉన్నాడు. కరోనా సమయంలో 2020లో హార్దిక్, నటాషా వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. వీరికి అగస్త్య అనే కుమారుడు ఉన్నాడు. అయితే, 2024 జూలైలో తాము విడిపోతున్నట్లు ఈ జంట అధికారికంగా ప్రకటించింది. తమ కుమారుడి భవిష్యత్తు కోసం ఇద్దరం కలిసి బాధ్యతలు నిర్వర్తిస్తామని (కో-పేరెంటింగ్) అప్పట్లో హార్దిక్ ఓ ప్రకటనలో తెలిపారు. విడాకుల తర్వాత కూడా వీరి మధ్య స్నేహపూర్వక వాతావరణం కొనసాగుతోంది. ఇటీవల హార్దిక్ తన మాజీ భార్య, కుమారుడి కోసం సుమారు రూ.4 కోట్ల విలువైన ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారును బహుమతిగా ఇచ్చాడు. ప్రస్తుతం హార్దిక్ మరో అమ్మాయి మహీకా శర్మతో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు వార్తలు వస్తుండగా, నటాషా మాత్రం హార్దిక్ కుటుంబంతో ఇలా కనిపించడం ఆసక్తికరంగా మారింది. విడాకులు తీసుకున్నా కుటుంబ బంధాలకు విలువ ఇస్తున్నారంటూ నెటిజన్లు వీరిని ప్రశంసిస్తున్నారు.



# ఏళ్ల శ్రమకు గుర్తింపు




'మైలురాళ్లు అనేవి ఒక్కరోజులో సాధ్యమయ్యేవి కావు. ఏళ్ల తరబడి నిరంతరంగా పడిన శ్రమకు దక్కే ఫలితాలు ఇవి' అని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేసర్ భువనేశ్వర్ కుమార్ అన్నాడు. ఐపీఎల్‌లో 200 వికెట్ల మైలురాయితో చరిత్ర సృష్టించిన సందర్భంగా అతడు తన అనుభవాలను పంచుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించడంపై భువనేశ్వర్ సంతోషం వ్యక్తం చేశాడు. "ఐపీఎల్ నా కెరీర్‌లో ఓ కీలక భాగం. 200 వికెట్లు పడగొట్టడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. నా ఐపీఎల్ ప్రయాణం ఆర్సీబీతోనే మొదలైంది. మళ్లీ ఇక్కడికే తిరిగొచ్చి ఈ ఘనత సాధించడం ఒక ఫుల్ సర్కిల్ మూమెంట్‌లా అనిపిస్తోంది" అని భువీ తెలిపాడు. బౌలర్లకు ఆట కఠినంగా మారుతోందని భువనేశ్వర్ అభిప్రాయపడ్డాడు. "కేవలం నైపుణ్యం మాత్రమే కాదు, పరిస్థితులకు తగ్గట్టుగా బౌలింగ్ చేయడం, బ్యాటర్లను ఇబ్బంది పెట్టేందుకు కొత్త మార్గాలు అన్వేషించడం ముఖ్యం. ఇది బ్యాటర్ల గేమ్ అని అంటుంటారు, కానీ బౌలర్లు కూడా వారికి గట్టి సవాలు విసురుతున్నారని నేను భావిస్తున్నా" అని వివరించాడు. చెన్నైతో మ్యాచ్ గురించి మాట్లాడుతూ, "ఓ బౌలింగ్ యూనిట్‌గా మేము సమావేశాల్లో చర్చించుకున్న ప్రణాళికలకే కట్టుబడి ఉన్నాం. ప్రత్యర్థులకు అనుగుణంగా సిద్ధమవుతున్న తీరు మాకు మంచి ఫలితాలను ఇస్తోంది" అని భువీ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్ 41 పరుగులకు 3 వికెట్లు పడగొట్టి, ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు తీసిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. మొత్తం 192 ఇన్నింగ్స్‌లలో 202 వికెట్లతో, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో చాహల్ తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు.



# సాత్విక్ - చిరాగ్ అవుట్

భారత స్టార్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి మరో మెగా టోర్నీ నుంచి వైదొలిగారు. ఇప్పటికే గాయం కారణంగా స్విస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్ ముందే నిష్క్రమించిన ఈ జోడీ ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆడడం లేదు. సాత్విక్ భుజం గాయంతో బాధ పడుతున్నందున టోర్నీ నుంచి వైదొలగుతున్నట్టు పీటీఐ వార్తా సంస్థతో కోచ్ టాన్ కిమ్ హెర్ వెల్లడించాడు. ఆ ఏడాది సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టిలకు కలిసి రావడం లేదు. ఈ మధ్య కాలంలో వీరిద్దరు ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్నారు. గాయం కారణంగా స్విస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో ఆడలేకపోయిన భారత జోడీ.. మరోసారి గాయం వల్లనే బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆడడం లేదు. 2023లో విజేతగా నిలిచిన సాత్విక్ - చిరాగ్ జంట నిష్క్రమణతో లక్ష్య సేన్, పీవీ సింధులపైనే పతకం ఆశలు పెట్టుకుంది భారత్. పురుషుల సింగిల్స్‌లో సేన్, మహిళల సింగిల్స్‌లో సింధులు సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారు. భుజం గాయం నుంచి కోలుకుంటున్న హెచ్‌హెస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ బరిలో దిగుతున్నా ఇటీవలి ఫామ్ దృష్ట్యా పతకం ఖాయమని చెప్పలేం. బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో దినేశ్ ఖన్నా 1965 పురుషుల సింగిల్స్‌లో స్వర్ణ పతకం గెలుపొందాడు.

# వివాహబంధంలోకి లెస్బియన్ క్రికెటర్లు



ఇంగ్లండ్ మహిళల జట్టు స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ అమీ జోన్స్ వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. తన చిరకాల ప్రేయసి , ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్ పీపా క్లియరీని జోన్స్ పెళ్లి చేసుకుంది. 2022 నుంచి డేటింగ్‌లో ఉన్న వీరిద్దరూ గతేడాది జూలైలో నిశ్చితార్థం చేసుకున్నారు. ఇప్పుడు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఏప్రిల్ 4న వీరిద్దరి వివాహం జరిగింది. ఇందుకు సంబంధించిన ఫోటోలను అమీ జోన్స్ సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. వీరి వివాహ వేడకకు ఇంగ్లండ్ మహిళా క్రికెటర్లు హాజరయ్యారు. కాగా మహిళల బిగ్ బాష్ లీగ్-2023లో సందర్భంగా జోన్స్-పీపాకు పరిచయం ఏర్పడింది.

# బౌలింగ్ వైఫల్యం వల్లే సీఎస్కే ఓటములు

ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా మూడు ఓటములను మూటగట్టుకోవడాన్ని టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ విశ్లేషించాడు. ముఖ్యంగా ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో సీఎస్కే బౌలింగ్ వైఫల్యాలను ఎత్తిచూపాడు. సీఎస్కే సమస్య బ్యాటింగ్‌లో లేదని, బౌలింగ్‌లోనే ఉందని స్పష్టం చేశాడు. ఆఫ్ఘన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ పేలవ ప్రదర్శన జట్టును ముంచేస్తోందని పఠాన్ అభిప్రాయపడ్డాడు. ఈ సీజన్‌లో 10 ఓవర్లలో 100కి పైగా పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడం దారుణమన్నాడు. నూర్ అహ్మద్ రన్-అప్ యాంగిల్, హ్యాండ్ పొజిషన్‌లో లోపాల వల్ల అలైన్‌మెంట్ తప్పుతోందని సాంకేతిక కారణాలను వివరించాడు. అలాగే, ఆర్సీబీ ఆల్‌రౌండర్ టిమ్ డేవిడ్ (25 బంతుల్లో 70లి)ను కట్టడి చేయడంలో సీఎస్కే బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించాడు. టిమ్ డేవిడ్‌కు ఆఫ్ స్టంప్ వైపు బంతులు వేసి అతనికి అనుకూలంగా మార్చారని, మిడిల్ లేదా లెగ్ స్టంప్‌పై బౌలింగ్ చేసి ఉంటే ఫలితం వేరేలా ఉండేదని పఠాన్ విశ్లేషించాడు.

# ఐపీఎల్ టికెట్స్: టెకీకి రూ.1.46 లక్షల టోకరా

ఐపీఎల్‌కు ఉన్న విపరీతమైన క్రేజ్‌ను సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. బెంగళూరులో జరిగిన ఓ ఘటనే ఇందుకు నిదర్శనం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) మధ్య జరిగిన మ్యాచ్ టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి, ఓ టెక్కీ నుంచి ఏకంగా రూ.1.46 లక్షలు కాజేశాడో కేటుగాడు. బెంగళూరులోని బి. నారాయణపురకు చెందిన 25 ఏళ్ల బాధితుడు ఈ మోసంపై మహదేవపుర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం, ఇన్‌స్టాగ్రామ్‌లో సుమిత్ బిస్వాల్ అనే వ్యక్తి తనను చిన్నస్వామి స్టేడియం టికెట్ కౌంటర్‌లో సీనియర్ సూపర్‌వైజర్‌గా పరిచయం చేసుకున్నాడు. మొదట రెండు టికెట్లను రూ.3,700 చొప్పున ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత అసలు మోసం మొదలుపెట్టాడు. రీఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్, అదనపు ఐడీ కార్డులు, ఫుడ్ కూపన్లు అంటూ రకరకాల సాకులు చెప్పి విడతలవారీగా డబ్బులు వసూలు చేశాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
మంగళవారం 7-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

## స్వీయ ఆరోగ్య రక్షణే అసలైన రక్ష

"ఆరోగ్యమే మహాభాగ్యం" అనేది కేవలం ఒక సామెత కాదు, అది మానవ జీవన మనుగడకు ప్రాథమిక సూత్రం. నేడు ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 7న మనం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 1948లో ప్రపంచ ఆరోగ్య సంస్థ స్థాపనకు గుర్తుగా ప్రతి ఏటా ఈ రోజున ప్రజల్లో ఆరోగ్యం పట్ల చైతన్యం నింపేలా కార్యక్రమాలు చేపడతారు. 2026 సంవత్సరానికి గానూ ప్రపంచ ఆరోగ్య సంస్థ "ఆరోగ్యం కోసం కలిసి.. సైన్స్‌తో కలిసి నిలబడండి" అనే నినాదాన్ని ప్రకటించింది. తప్పుడు సమాచారం ప్రబలుతున్న ప్రస్తుత కాలంలో, ప్రాణాలను కాపాడే శాస్త్రీయ ఆధారిత చికిత్సలు, నివారణా పద్ధతులపై విశ్వాసాన్ని పెంచడమే ఈ థీమ్ ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం గతంతో పోలిస్తే వైద్య విజ్ఞానం ఎంతో పురోగమించినప్పటికీ, ఆధునిక జీవనశైలి కారణంగా కొత్త ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా ఆరోగ్యానికి కీలకమని నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలను అధిగమించడం నేటి తరం ముందున్న పెద్ద సవాలు. మధుమేహం, గుండె జబ్బులు, రక్తపోటు వంటివి వేగంగా పెరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్ అలవాట్లు. పేద, ధనిక అనే తేడా లేకుండా నాణ్యమైన వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలి. ప్రపంచంలోని సగానికి పైగా జనాభాకు నేటికీ సరైన ఆరోగ్య సేవలు అందడం లేదు. ఆరోగ్యంగా ఉండటం అంటే కేవలం రోగాలు లేకుండా ఉండటం మాత్రమే కాదు, శారీరక, మానసిక, సామాజికంగా పరిపూర్ణంగా ఉండటం. ఇందుకోసం మనం పౌష్టికాహారం తీసుకోవాలి. నిత్య వ్యాయామం చేయాలి. రోజుకు 7-8 గంటల నిద్ర, ధారాళంగా నీరు తాగడం చాలా అవసరం. శాస్త్రీయంగా నిరూపితమైన ఆరోగ్య సమాచారాన్ని మాత్రమే నమ్మడం అనేది చాలా ముఖ్యమైనది. ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం. ప్రభుత్వం అందించే ఆరోగ్య పథకాలను వినియోగించుకుంటూనే, స్వీయ ఆరోగ్య పరిరక్షణపై ప్రతి పౌరుడు శ్రద్ధ వహించాలి. ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి మాత్రమే ఆరోగ్యకరమైన కుటుంబాన్ని, తద్వారా ఆరోగ్యకరమైన దేశాన్ని నిర్మించగలడు.

# గ్రామీణ భారతం.. సామాజిక ప్రభావం

**భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఒకప్పుడు పూర్తిగా స్వయం పోషక నిర్మాణంతో కొనసాగిన వ్యవస్థ. 1950 కాలానికి ముందుగా గ్రామాలు స్వతంత్ర ఆర్థిక యూనిట్లుగా ఉండేవి. వ్యవసాయం ప్రధాన ఆధారం కాగా, గ్రామంలోనే అవసరమైన అన్ని వృత్తులు అందుబాటులో ఉండేవి. కమ్మరి, కులాలవాడు, కుసుమశిల్పి, బుట్టల తయారీదారులు, నేయ్యాళ్లు వంటి వృత్తులు గ్రామ జీవనంలో కీలక భాగాలుగా ఉండేవి.**





డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

1951 జనగణన ప్రకారం సుమారు 82% జనాభా గ్రామాల్లో నివసించగా, అందులో 70% పైగా ప్రజలు ప్రత్యక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉండేవారు. ఇది గ్రామాలను పూర్తిగా స్వయం సమృద్ధిగా నిలబెట్టింది. 1960 వరకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్కెట్ ప్రభావం చాలా తక్కువగా ఉండేది. రైతులు తమ అవసరాలకు సరిపడా పంటలు పండించేవారు. మిగిలినవి గ్రామంలోనే మార్పిడి వ్యవస్థ ద్వారా వినియోగించబడేవి. డబ్బు లావాదేవీలు కంటే వస్తు మార్పిడి ప్రాధాన్యం ఎక్కువగా ఉండేది. ఈ పరిస్థితి గ్రామాల్లో సమానత్వాన్ని కొంతవరకు నిలబెట్టింది. సామాజికంగా పరస్పర ఆధారిత జీవన విధానం ఉండేది. కానీ 1965 తర్వాత హరిత విప్లవం ప్రారంభమైంది. అధిక దిగుబడి విత్తనాలు, రసాయన ఎరువులు, సాగునీటి విస్తరణ వంటి మార్పులు వ్యవసాయ రంగంలో ప్రవేశించాయి. 1975 నాటికి పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో ఉత్పత్తి 40% వరకు పెరిగింది. ఈ మార్పులు కొంతమందికి ఆర్థిక లాభాలను తీసుకు వచ్చినా, చిన్న రైతులు మాత్రం వెనుకబడ్డారు. పెద్ద భూస్వాములు ఆధునిక సాంకేతికతను స్వీకరించగా, చిన్న రైతులు అప్పులపాలయ్యారు. దీని వల్ల గ్రామీణ సమాజంలో అసమానతలు పెరిగాయి. 1980 నుండి 1990 వరకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పులు మరింత వేగంగా జరిగాయి. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత మార్కెట్ ఆధారిత వ్యవస్థ బలపడింది. ఈ కాలంలో గ్రామీణ ఉపాధిలో వ్యవసాయ వాటా 70% నుండి 58% కు తగ్గింది. సేవల రంగం, చిన్న పరిశ్రమలు పెరిగాయి. కానీ ఈ మార్పు సమానంగా జరగలేదు. కొంతమంది మాత్రమే కొత్త అవకాశాలను పొందగలిగారు. మిగతా వారు వలసలకు గురయ్యారు.

2000 తర్వాత గ్రామీణ భారతదేశంలో పెద్ద మార్పులు చోటుచేసుకున్నాయి. 2011 జనగణన ప్రకారం గ్రామీణ జనాభా 68% కు తగ్గింది. వ్యవసాయంపై ఆధారపడే వారి శాతం 50% కంటే తక్కువకు పడిపోయింది. యువతలో 35% మంది పట్టణాలకు వలస వెళ్లినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది గ్రామీణ కుటుంబ వ్యవస్థపై ప్రభావం చూపింది. సంయుక్త కుటుంబ వ్యవస్థ క్రమంగా క్షీణించింది. మహిళల పాత్రలో కూడా గణనీయమైన మార్పులు వచ్చాయి. 1990లో మహిళల శ్రామిక పాల్గొనిక 22% ఉండగా, 2020 నాటికి ఇది 30% వరకు పెరిగింది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడ్డారు. ఇది వారి సామాజిక స్థితిని మెరుగుపరిచింది. కుటుంబ నిర్ణయాల్లో వారి పాత్ర పెరిగింది. అయితే అప్పుల సమస్య కూడా పెరిగింది. 2005 నాటికి రైతు కుటుంబాలలో సుమారు 48% మంది అప్పుల్లో ఉన్నారు. 2019 నాటికి ఈ సంఖ్య 52% కు పెరిగింది. వ్యవసాయ వ్యయాలు పెరగడం, మార్కెట్ అస్థిరత వల్ల రైతులు ఆర్థికంగా క్షీణించారు. ఇది సామాజిక ఒత్తిడిని పెంచింది.

గ్రామీణ మౌలిక సదుపాయాల్లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. 2000లో విద్యుత్ అందుబాటు 55% గ్రామాలకు ఉండగా, 2020 నాటికి ఇది 95% కు పెరిగింది. రహదారులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు పెరగడం వల్ల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. అయినప్పటికీ ప్రాంతాల మధ్య అసమానతలు కొనసాగుతున్నాయి. స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ నుండి మార్కెట్ ఆధారిత వ్యవస్థకు మార్పు వల్ల సామాజిక నిర్మాణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు పరస్పర సహకారం ప్రధానమైన గ్రామ జీవితం ఇప్పుడు పోటీతో నిండిపోయింది. సంప్రదాయ వృత్తులు క్షీణించాయి. యువతలో వ్యవసాయంపై ఆసక్తి తగ్గింది. ముగింపుగా చెప్పాలంటే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు సామాజిక నిర్మాణాన్ని పూర్తిగా మార్చాయి. 1950లో స్వయం సమృద్ధిగా ఉన్న గ్రామాలు 2020 నాటికి మార్కెట్ ఆధారిత వ్యవస్థలో భాగమయ్యాయి. ఇది అభివృద్ధిని తీసుకువచ్చినప్పటికీ అసమానతలను కూడా పెంచింది. కాబట్టి భవిష్యత్తులో గ్రామీణ అభివృద్ధి విధానాలు సమానత్వం, స్థిరత్వం, సామాజిక న్యాయం లక్ష్యంగా రూపొందించాల్సిన అవసరం ఉంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో జరిగిన మార్పులు కేవలం ఉత్పత్తి పద్ధతుల్లో వచ్చిన పరిణామాలు మాత్రమే కాదు; అవి గ్రామీణ సమాజపు అంతర్గత నిర్మాణాన్ని, సంబంధాలను, విలువలను, జీవన విధానాలను లోతుగా ప్రభావితం చేసిన సామాజిక విప్లవంగా చెప్పవచ్చు. ఒకప్పుడు 1950 కాలానికి ముందున్న స్వయం పోషక గ్రామీణ వ్యవస్థలో గ్రామం ఒక సమగ్ర జీవన యూనిట్‌గా ఉండేది. ఆ కాలంలో సుమారు 80% పైగా ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనాన్ని కొనసాగించగా, గ్రామాల్లోని వృత్తులు పరస్పర ఆధారితంగా పనిచేసేవి. కమ్మరి తన పనిని రైతుకు అందించగా, రైతు పంటను ఇతర వృత్తిదారులతో పంచుకునేవాడు. ఈ విధంగా ఆర్థిక వ్యవస్థ సామాజిక సంబంధాలను బలపరిచేది. అయితే 1965 తర్వాత ప్రారంభమైన వ్యవసాయ సాంకేతిక మార్పులు, 1991 ఆర్థిక సంస్కరణలు, 2000 తర్వాత గ్లోబలైజేషన్ ప్రభావం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చేశాయి. 1970లో వ్యవసాయంపై ఆధారపడిన జనాభా సుమారు 70% ఉండగా, 2020 నాటికి ఇది 45% వరకు తగ్గింది. అదే సమయంలో సేవల రంగం, పరిశ్రమల రంగం వాటా 30% నుండి 55% వరకు పెరిగింది. ఈ మార్పు గ్రామీణ ప్రజల జీవనోపాధిని విభిన్నంగా మార్చినప్పటికీ, అందరికీ సమానంగా అవకాశాలు అందించలేదు. ఈ మార్పుల వల్ల గ్రామీణ సమాజంలో అసమానతలు గణనీయంగా పెరిగాయి. ఒకవైపు పెద్ద భూస్వాములు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి తమ ఆదాయాన్ని 40% వరకు పెంచుకోగలిగారు. మరోవైపు చిన్న రైతులు, కూలీలు అప్పుల బారిన పడి ఆర్థికంగా బలహీనపడ్డారు. 2019 నాటికి రైతు కుటుంబాల్లో 50% పైగా అప్పుల్లో ఉన్నారని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది గ్రామీణ కుటుంబాల్లో మానసిక ఒత్తిడి, అస్థిరతకు దారితీసింది.

వలసలు కూడా గ్రామీణ సమాజంపై గాఢమైన ప్రభావాన్ని చూపించాయి. 2001 నుండి 2020 మధ్య కాలంలో గ్రామీణ యువతలో సుమారు 35% మంది ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లారు. దీని వల్ల గ్రామాల్లో వృద్ధులు, మహిళలు మాత్రమే మిగిలే పరిస్థితి ఏర్పడింది. ఇది సంయుక్త కుటుంబ వ్యవస్థను దెబ్బతీసింది. ఒకప్పుడు 60% కుటుంబాలు సంయుక్త కుటుంబాలుగా ఉండగా, ప్రస్తుతం అది 20% కన్నా తక్కువకు పడిపోయింది. కుటుంబ సంబంధాలు బలహీనపడ్డాయి. మహిళల పాత్రలో వచ్చిన మార్పులు గ్రామీణ సమాజంలో ఒక సానుకూల పరిణామంగా చెప్పవచ్చు. 1990లో మహిళల శ్రామిక భాగస్వామ్యం 20% ఉండగా, 2020 నాటికి ఇది 30% పైగా పెరిగింది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడటం వల్ల వారి సామాజిక స్థానం మెరుగుపడింది. కుటుంబ నిర్ణయాలలో వారి పాత్ర 25% నుండి 45% వరకు పెరిగినట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఇది లింగ సమానత్వానికి దోహదపడింది. విద్యా రంగంలో కూడా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 1961లో గ్రామీణ అక్షరాస్యత రేటు 30% మాత్రమే ఉండగా, 2011 నాటికి ఇది 68% వరకు పెరిగింది. ఇది అవగాహనను పెంచినా, విద్యతో వచ్చిన ఆశలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అందించలేకపోవడం వల్ల నిరుద్యోగ సమస్య పెరిగింది. విద్యావంతులైన యువతలో 25% వరకు నిరుద్యోగం కనిపించడం ఒక ప్రధాన సమస్యగా మారింది.

మౌలిక సదుపాయాల అభివృద్ధి గ్రామీణ జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది. 2000లో విద్యుత్ అందుబాటు 50% గ్రామాలకు మాత్రమే ఉండగా, 2020 నాటికి ఇది 95% కు చేరుకుంది. రహదారులు, డిజిటల్ సదుపాయాలు, ఆరోగ్య కేంద్రాలు పెరగడం వల్ల గ్రామీణ జీవితం కొంత సౌకర్యవంతమైంది. అయితే ఈ అభివృద్ధి అన్ని ప్రాంతాలకు సమానంగా చేరలేదు. ప్రాంతీయ అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయి. సంప్రదాయ వృత్తుల క్షీణత గ్రామీణ సంస్కృతిపై ప్రతికూల ప్రభావాన్ని చూపించింది. ఒకప్పుడు గ్రామాల్లో 40% ప్రజలు చేతివృత్తులపై ఆధారపడగా, ప్రస్తుతం అది 10% కన్నా తక్కువకు పడిపోయింది. ఇది కేవలం ఆర్థిక నష్టమే కాదు; సాంస్కృతిక వారసత్వం కోల్పోవడానికీ దారితీసింది. గ్రామీణ సంస్కృతి క్రమంగా పట్టణ ప్రభావానికి లోనవుతోంది. మొత్తంగా చూస్తే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో 1950 నుండి 2020 వరకు జరిగిన మార్పులు గ్రామీణ సమాజాన్ని పూర్తిగా మార్చాయి. ఒకప్పుడు సమానత్వం, పరస్పర సహకారం ప్రధానమైన గ్రామ జీవితం ఇప్పుడు అసమానతలు, వ్యక్తిగత ప్రయోజనాలతో నిండిపో యింది. అభివృద్ధి కొంతమందికి లాభాలను అందించినప్పటికీ, చాలా మందిని వెనుకబెట్టింది.

అందువల్ల భవిష్యత్తులో గ్రామీణ అభివృద్ధి విధానాలు కేవలం ఆర్థిక వృద్ధిపై కాకుండా సామాజిక సమానత్వంపై దృష్టి పెట్టాలి. చిన్న రైతులకు మద్దతు, గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే గ్రామీణ సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. స్వయం పోషక గ్రామాల సూత్రాలను ఆధునిక సాంకేతికతతో కలిపి అమలు చేస్తే గ్రామీణ భారతదేశం స్థిరమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో జరిగిన మార్పులను లోతుగా పరిశీలిస్తే, ఇది కేవలం ఆర్థిక పరిణామం కాదు; ఇది సమాజపు రూపురేఖలను పూర్తిగా మార్చిన ఒక విస్తృత సామాజిక పరివర్తన. 1950 దశకంలో భారత గ్రామాలు స్వయం పోషక నిర్మాణంతో, పరస్పర ఆధారిత జీవన విధానంతో నిలిచాయి. ఆ కాలంలో సుమారు 82% జనాభా గ్రామాల్లో నివసించగా, వారిలో 70% పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవించారు. వ్యవసాయం, చేతివృత్తులు, పశుపోషణ, స్థానిక మార్పిడి వ్యవస్థ కలిసి గ్రామాన్ని ఒక సమగ్ర ఆర్థిక యూనిట్‌గా నిలబెట్టాయి. ఈ నిర్మాణం సామాజికంగా సమిష్టి భావనను, పరస్పర గౌరవాన్ని, సహకారాన్ని పెంపొందించింది. కానీ కాలక్రమేణా 1965 తర్వాత ప్రారంభమైన వ్యవసాయ ఆధునీకరణ, 1980 తర్వాత వేగవంతమైన మార్కెట్ ప్రవేశం, 1991 ఆర్థిక సంస్కరణలు, 2000 తర్వాత గ్లోబల్ ప్రభావం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చాయి. ఈ మార్పుల ప్రభావం గ్రామీణ సమాజంపై బహుముఖంగా కనిపిస్తుంది. ఒకవైపు ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది; మరోవైపు సామాజిక అసమానతలు గణనీయంగా విస్తరించాయి.

ఒకవైపు అభివృద్ధి, ఆధునీకరణ, సౌకర్యాలు పెరిగాయి. మరోవైపు అసమానతలు, నిరుద్యోగం, వలసలు, సంస్కృతిక క్షీణత వంటి సమస్యలు పెరిగాయి. 1950లో స్వయం పోషకంగా ఉన్న గ్రామాలు 2020 నాటికి మార్కెట్ ఆధారిత వ్యవస్థలో భాగమయ్యాయి. ఈ మార్పు అనివార్యమైనదే అయినప్పటికీ, ఇది సమానత్వాన్ని దెబ్బతీసింది. 1950 దశకంలో గ్రామాలు స్వయం పోషక వ్యవస్థలుగా ఉండి, స్థానిక అవసరాలను స్థానిక వనరుల ద్వారానే తీర్చుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండేవి. ఆ సమయంలో సుమారు 80% పైగా జనాభా గ్రామాల్లో నివసించగా, 70% వరకు ప్రజలు వ్యవసాయం, సంబంధిత వృత్తులపై ఆధారపడి జీవించారు. ఈ నిర్మాణం గ్రామాల్లో సమానత్వానికి, పరస్పర సహకారానికి బలమైన పునాది వేసింది. అయితే 1960 తర్వాత ప్రారంభమైన సాంకేతిక మార్పులు, 1991 ఆర్థిక సంస్కరణలు, 2000 తర్వాత గ్లోబల్ మార్కెట్ ప్రభావం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశలోకి నడిపించాయి. 1970లో వ్యవసాయంపై ఆధారపడిన వారి శాతం 70% ఉండగా, 2020 నాటికి అది 45% కు తగ్గింది. ఇది ఉపాధి నిర్మాణంలో వచ్చిన పెద్ద మార్పును సూచిస్తుంది. సేవల రంగం, చిన్న పరిశ్రమలు, పట్టణ ఉపాధి అవకాశాలు పెరగడంతో గ్రామీణ యువతలో వలసలు పెరిగాయి. సుమారు 30% నుండి 35% వరకు యువత పట్టణాలకు వలస వెళ్లడం వల్ల గ్రామీణ కుటుంబ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పుల ప్రభావంగా సంయుక్త కుటుంబ వ్యవస్థ క్రమంగా క్షీణించింది. ఒకప్పుడు 60% వరకు ఉన్న సంయుక్త కుటుంబాలు ప్రస్తుతం 20% లోపుకు పడిపోయాయి. కుటుంబ బంధాలు బలహీనపడ్డాయి. వృద్ధులు, మహిళలు గ్రామాల్లో మిగిలిపోవడం వల్ల సామాజిక రక్షణ వ్యవస్థ బలహీనపడింది. ఇది గ్రామీణ సమాజంలో ఒంటరితనం, అస్థిరతను పెంచింది. ఆర్థిక అసమానతలు కూడా ఈ మార్పుల వల్ల పెరిగాయి. పెద్ద రైతులు సాంకేతికతను ఉపయోగించి తమ ఆదాయాన్ని 40% వరకు పెంచుకోగలిగితే, చిన్న రైతులు అప్పుల బారిన పడ్డారు. 2019 నాటికి రైతు కుటుంబాల్లో 50% పైగా అప్పుల్లో ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది గ్రామీణ సమాజంలో ఆర్థిక అసమానతలను మరింత బలపరిచింది. అప్పుల ఒత్తిడి కుటుంబాల్లో మానసిక ఆందోళనలకు, సామాజిక సమస్యలకు దారితీసింది. మహిళల పాత్రలో వచ్చిన మార్పులు ఒక సానుకూల పరిణామంగా కనిపిస్తున్నాయి. కాగా, సంప్రదాయ వృత్తుల క్షీణత గ్రామీణ సంస్కృతిపై తీవ్రమైన ప్రభావాన్ని చూపించింది. ఒకప్పుడు 40% వరకు ఉన్న చేతివృత్తులపై ఆధారపడే ప్రజలు ప్రస్తుతం 10% లోపుకు తగ్గిపోయారు. ఇది సాంస్కృతిక వారసత్వం కోల్పోవడానికి దారితీసింది. గ్రామీణ జీవితం పట్టణ ప్రభావంతో మారిపోతోంది. మొత్తంగా చూస్తే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు అభివృద్ధి అవకాశాలను తీసుకువచ్చినా, అసమానతలు, వలసలు, నిరుద్యోగం, సంస్కృతిక క్షీణత వంటి సమస్యలను కూడా పెంచాయి. ఒకప్పుడు స్వయం సమృద్ధిగా ఉన్న గ్రామాలు ఇప్పుడు మార్కెట్ ఆధారిత వ్యవస్థలో భాగమయ్యాయి. ఇది అనివార్యమైన మార్పు అయినప్పటికీ, సమానత్వాన్ని దెబ్బతీసింది. కాబట్టి భవిష్యత్తులో గ్రామీణ అభివృద్ధి విధానాలు సమగ్ర దృష్టితో ఉండాలి. చిన్న రైతులకు మద్దతు, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, సంప్రదాయ వృత్తుల పరిరక్షణ వంటి అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ సామాజిక సమానత్వాన్ని సాధించగలిగితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇదే గ్రామీణ భారతదేశ భవిష్యత్తుకు స్థిరమైన మార్గం.

**భవిష్యత్తులో గ్రామీణ అభివృద్ధి విధానాలు సమగ్ర దృష్టితో రూపొందించాలి. చిన్న రైతులకు 50% వరకు సబ్సిడీ మద్దతు, గ్రామీణ పరిశ్రమలకు 30% ప్రోత్సాహకాలు, మహిళల ఉపాధి అవకాశాలను 40% వరకు పెంచే విధానాలు అమలు చేయాలి. యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించాలి. సంప్రదాయ వృత్తులను సంరక్షించడానికి ప్రత్యేక పథకాలు రూపొందించాలి. అభివృద్ధి సాధించాలంటే ఆర్థిక వృద్ధి మాత్రమే కాకుండా సామాజిక సమానత్వం కూడా అవసరం. స్వయం పోషక గ్రామాల సూత్రాలను ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మలచగలిగితేనే గ్రామీణ భారతదేశం స్థిరమైన, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది. ఇదే నిజమైన సామాజిక న్యాయం, స్థిరత్వం, సమగ్ర పురోగతికి మార్గం.**

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.